

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు



- ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు ఇవ్వాలి
- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవా - 8లో

వాయుగండం

జిల్లా అంతటా పెరిగిన వర్షాలు
లోతట్టు ప్రాంతాలు జలమయం

- కుప్పలు వేయని పొలాల్లో తడిసిపోయిన వరి పనలు
- లోతట్టు భూముల్లో నీట మునిగిన పనలు
- భారీ వర్షాల హెచ్చరికలతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం
- పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం
- వరి పంటకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
  టోల్ ఫ్రీ నంబర్లు: 08924- 226599, 222888



సబ్బవరం మండలం ఇరువాడలో నీటిలో తేలుతున్న వరి పనలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం తీవ్ర రూపం దాల్చింది. శుక్రవారం వాయుగుండంగా బలపడడంతో జిల్లా అంతటా వర్షాలు పెరిగాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. సాయంత్రం తరువాత వర్షం తీవ్రత పెరిగింది. సముద్రతీర మండలాలతో పాటు వీటికి ఆనుకుని వున్న మండలాల్లో భారీ వర్షం కురుస్తున్నది. దీంతో వరితోపాటు ఇతర పంటల రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసి, గురువారం వరకు కుప్ప వేయని పొలాల్లో వరి పనలు తడిసిముద్దయ్యాయి. కొన్నిచోట్ల వరి పనలు నీటిలో తేలుతున్నాయి. కొంతమంది రైతులు వరి పంటను కాపాడుకోవడానికి పనలను గట్లపైనే, ఎత్తయిన ప్రదేశాలకు చేరుస్తున్నారు. ధాన్యం మొలకెత్తకుండా వుండడానికి పనలపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు.

పొలాల్లో నుంచి వర్షం నీటిని బయటకు పంపడానికి కాలువలు తీసుకున్నారు. మరో రెండు రోజుల వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో వరి కంకులు మొలకెత్తే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీటి ప్రవాహంలో వరి పనలు కొట్టుకుపోతాయని గుబులు చెందుతున్నారు. కాగా వరి కుప్పలు వేయలేకపోయిన వారిలో ఎక్కువ మంది రైతులు దేవుడిపైనే భారం వేశారు. ఇదిలావుండగా వరి పైరు కోయని పొలాల్లో ఈదురు గాలుల కారణంగా పంట నేలవాలింది. వర్షాలు అధికమైతే పొలాల్లో నీరు నిలిచిపోయి వరి కంకులు నీటిలో నానిపోయి ధాన్యం రంగుమారుతుందని, మొలకెత్తే అవకాశం కూడా వుందని రైతులు వాపోతున్నారు.

అనకాపల్లి పట్టణంలో ముసురు వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు అడపాదడపా జల్లులు కురవగా, అనంతరం వర్షం పెరిగింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పరవాడ మండలంలోనిఇ పరవాడ, తానాం, స్వయంభూవరం, కొత్త వెన్నెలపాలెం, గొల్లలపాలెంలో కోతకు వచ్చిన వరి పంట ఈదురు గాలులతో నేవాలింది. కోత కోసి కుప్ప వేయని పొలాల్లో వరి పనలు నీటమునిగాయి.



మునగపాక మండలంలో నీట మునిగిన వరి పనలు

రేలుగుంట మండలంలో రేలుగుంట, బీబీపట్నం, కొమరవోలు తదితర గ్రామాల్లో కోసిన వరి పనలు నీట మునగడంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రంగుమారడమే కాకుండా మొలకెత్తే అవకాశం ఉందని వాపోతున్నారు.

గొలుగొండ మండలం పాతమల్లంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, అమ్మపేట, జోగంపేట, పప్పుశెట్టిపాలెం, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం, సీహెచ్.నాగాపురం, పల్లాపూరు, ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, కొంగసింగి, విప్పలపాలెం, తదితర గ్రామాల్లో సుమారు 200 హెక్టారుల్లో వరి పనులు కుప్ప వేయలేదు. వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకవరపాలెం మండలంలో మాకవరపాలెం, తామరం, కొండలఅగ్రహారం, బయ్యవరం, గిడుతూరు, మల్లవరం, పైడిపాల తదితర గ్రామాల్లో వర్షానికి వరి పనులు తడిసిపోయాయి.

రాంబిల్లి మండలంలో 52.7 హెక్టార్లలో వరి పనలు తడిసిపోయాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సబ్బవరం మండలంలో గొర్లివానిపాలెం, ఇరువాడ, అసకపల్లి, గుల్లేపల్లి, వంగలి, మలునాయుడుపాలెం తదితర గ్రామాల్లో పలువురు రైతులకు చెందిన వరి పనలు వర్షానికి తడిసిపోయి నీట మునిగాయి. కోత కోసిన తరువాత పనలు పూర్తిగా ఎండకపోవడంతో కుప్పలు వేయలేకపోయామని చెబుతున్నారు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా దేవరాపల్లి మండలంలో 24.2 మిల్లీ మీటర్లు, సబ్బవరం మండలంలో 22.2 మి.మీ.ల వర్షం కురిసింది. మాడుగులలో 9.2 మి.మీ.లు, కె.కోటపాడులో 15.8 ... మిగతా 8వ పేజీలో

అక్రమ మైనింగ్!

ప్రభుత్వం మారినా ఆగని తవ్వకాలు

- నల్లరాయి క్వారీలపై ఫిర్యాదుల వెల్లువ
- కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు



అనకాపల్లి మండలం మార్టూరులోని ఒక క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నల్ల రాయి క్వారీల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతున్నది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో లీజు తీసుకున్న భూమి కంటే ఎక్కువ విస్తీర్ణంలో అడ్డగోలుగా తవ్వకాలు జరిపి ప్రభుత్వానికి రాయల్టీ ఎగవేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నల్లరాతి క్వారీల్లో అక్రమ మైనింగ్‌కు చెక్ పడుతుందని అంతా భావించారు. కానీ పరిస్థితిలో ఎటువంటి మార్పు కానరాలేదు. కొంతమంది వైసీపీ నాయకులు, స్థానిక కూటమి నేతలతో చేతులు కలిపి బినామీల పేర్లతో క్వారీలు నిర్వహిస్తూ విచ్చలవిడిగా మైనింగ్ చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే కొండలను బాంబులతో పేల్చేస్తున్నారు. పర్యావరణ అనుమతులతోపాటు అన్ని రకాల మైనింగ్ అనుమతులు



జంగాలపాలెంలో క్వారీ వద్ద విజిలెన్స్ అధికారులు (ఫైల్ ఫొటో)

ఉన్నాయని పరిసర గ్రామాల ప్రజలను నమ్మబలుకుతూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రభుత్వం మారినా మైనింగ్ అక్రమాలు ఆగకపోవడంపై కొంతమంది స్థానికులు గనుల శాఖ ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. కుంచంగా పరిసరాల్లో అక్రమ మైనింగ్ కారణంగా తాము పడుతున్న ఇబ్బందులపై రొంగలివానిపాలెం గ్రామస్థులు గతంలో అనేక పర్యాయాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఇటీవల కాలంలో అనకాపల్లి మండలంలో పెద్దఎత్తున నిర్వహిస్తున్న అక్రమ నల్లరాయి క్వారీలు, స్టోన్ క్రషర్లపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన తనిఖీ అధికారులు కుంచంగి, కూండ్రం, జంగాలపాలెం, రొంగలివానిపాలెం గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీల్లో తనిఖీలు జరిపారు. గనుల శాఖ, స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి రికార్డులను తమతో తీసుకువెళ్లారు. తాజాగా అనకాపల్లి మండలం మామిడిపాలెం, బవులువాడ, మార్టూరు, మాకవరం పరిసరాల్లో అనుమతి లేకుండా, నిర్దేశిత హద్దులు దాటి తవ్వకాలు జరుపుతున్న నల్లరాయి క్వారీలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దృష్టి సారించాయి. మామిడిపాలెంలో రెండు క్వారీలు, మార్టూరు, మాకవరంలలో మూడు క్వారీల్లో అక్రమ మైనింగ్‌పై ... మిగతా 8వ పేజీలో

వైసీపీకి వరుస షాక్‌లు

పార్టీని వీడుతున్న ముఖ్య నేతలు



రమాకుమారి

- వారం కిందట మాజీ మంత్రి ముత్తంశెట్టి...
- ఇప్పుడు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- పార్టీ కార్యక్రమాలకు విశాఖ మాజీ ఎంపీ, డీసీసీబీ మాజీ చైర్మన్ దూరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ముఖ్య నేతలు ఝలక్ ఇస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారం కిందట పార్టీకి రాజీనామా చేయగా, శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. మరికొందరు నేతలు కూడా అదేదారిలో ఉన్నారనే ప్రచారం ఆ పార్టీ నేతలను కలవరపరుస్తోంది. రైతుల సమస్యలపై ఈనెల 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనకు వైసీపీ అధినేత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జరగడానికి ముందురోజు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 23న ఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమానికి వైసీపీ నిర్ణయించింది. ఈలోగా 2024 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయనతోపాటు డెయిరీలో డైరెక్టర్లుగా ఉన్న 12 మంది కూడా వైసీపీకి రాజీనామా చేశారు. ఇక మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కోలా గురువులు, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు వంటివారు ... మిగతా 8వ పేజీలో

దొప్పెర్లలో భూ దందా

వైసీపీ హయాంలో భారీ కుంభకోణం

- అనాదీనం భూమిలో తొమ్మిది ఎకరాలను 22ఏ నుంచి తప్పించి జిరాయితీగా మార్పు
- సబ్ డివిజన్ చేసి వైసీపీ ముఖ్యనేత భార్య పేరున పట్టాదారు పాస్‌బుక్ జారీ
- మరుసటి రోజే ఎకరా రూ.కోటి చొప్పున విక్రయం
- మరో సర్వే నంబరులో 12.19 ఎకరాలు సైతం వైసీపీ నేతల పరం
- దర్జాగా రియల్ ఎస్టేట్ వ్యాపారికి విక్రయం
- ఇరువాడలో 5.28 ఎకరాలను కొట్టేసిన వైనం
- వైసీపీ నేతల భూ దందాపై విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌కు ఎంపీటీసీ సభ్యుడు ఫిర్యాదు

అచ్యుతాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

అధికారాన్ని అడ్డంపెట్టుకుని పలువురు వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు ఎడాపెడా భూ కబ్జాలకు పాల్పడ్డారు. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్టుగా అధికారులు సైతం వీరికి సహకరించారు. ప్రభుత్వ పెద్దల వద్ద తమకున్న పలుకుబడితో అధికారులను లోబరచుకొని కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ అనాదీన భూములను తమ పేరున రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రభుత్వం మారితే తమ మెడకు చుట్టుకోకుండా వుండేందుకు వెంటనే ఇతరులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. అచ్యుతాపురం మండలం దొప్పెర్ల పంచాయతీ పరిధిలో జరిగిన భారీ భూ కుంభకోణానికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి' సేకరించిన వివరాలిలా వున్నాయి.



దొప్పెర్ల సర్వే నంబరు 63లో చేతులు మారిన ప్రభుత్వ భూమిలో వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్

మండలంలోని దొప్పెర్ల పంచాయతీ సర్వే నంబర్లు 41, 49, 50, 51లలో 23.24 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రికార్డుల్లో ఇది అనాదీనం కింద నమోదై ఉంది. ఇది అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిని ఆనుకొని వుండడంతో ఇక్కడ ఎకరా రూ.2 కోట్లు పలుకుతున్నది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ భూములపై ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకుల కన్ను పడింది. ఎలాగైనా చేజిక్కించుకోవాలని పావులు కదిపారు. అనాదీనం (22ఏ) నుంచి తప్పించి జిరాయితీగా మార్చాలంటూ 2021లో ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ ద్వారా సీసీఎల్ఏకి అర్జీ పెట్టారు. ఇందుకు వీలుకాని సీసీఎల్ఏ నుంచి ఆదేశాలు వచ్చాయి. అయినా వైసీపీ నాయకులు వెనకడుగు వేయలేదు. సర్వే నంబరు 49లో వున్న 14.17 ఎకరాల్లో తొమ్మిది ఎకరాలను 22ఏ నుంచి తప్పించి సర్వే నంబరు 49/2గా నమోదు చేయించి, ఒక వైసీపీ నేత భార్యపేరున 2023 ఆగస్టు 22న పట్టాదారు పాస్ పుస్తకం పొందారు.. మరునాడే.. అంటే 2023 ఆగస్టు 23వ తేదీన ఈ భూమిని వేరొకరికి ఎకరా కోటి రూపాయల ధర చొప్పున రూ.9 కోట్లకు విక్రయించారు. ఈ మేరకు ఎలమంచిలో సబ్‌రిజిస్ట్రార్ ... మిగతా 8వ పేజీలో

ఇరువాడ సర్వే నంబరు 108లో వైసీపీ నాయకుడు, అతని అనుచరుల పేరున మార్పించుకున్న ప్రభుత్వ భూమి ఇదే



గో మాంసంతో కంటెయినర్ పట్టివేత

- ఐదుగురిపై కేసు



గో మాంసాన్ని పూడ్చివేస్తున్న దృశ్యం

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలో వేంపాడు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం గో మాంసంతో ఉన్న మినీ కంటెయినర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఐదు టన్నుల గో మాంసం స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదుచేశారు. సీఐ కుమారస్వామి అందించిన వివరాల ప్రకారం..విజయనగరం జిల్లా సంతపాలెం నుంచి రాజమహేంద్రవరానికి మినీ కంటైనర్‌లో గో మాంసం తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో వేంపాడు వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ఆ సమయంలో వస్తున్న మినీ కంటెయినర్‌ను తనిఖీ చేయగా సుమారు ఐదు టన్నుల గో మాంసం ఉంది. దీంతో మినీ కంటైనర్‌తో గో మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గో మాంసాన్ని పూడ్చివేశారు. కంటెయినర్ లారీ యజమాని మణికంఠ సహా మరో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.


ఒక ఉద్యోగం.. రెండు జీతాలు!

15 సంవత్సరాల నుంచి డ్రా చేస్తున్న పీఏసీఎస్ కార్యదర్శి

- ఆలస్యంగా గుర్తించిన అధికారులు
- రూ.16 లక్షలు తిరిగి జమ చేయాలని ఆదేశం
- షోకాజ్ నోటీసు జారీ



చోద్యం పీఏసీఎస్



చోద్యం సొసైటీ పూర్వ కార్యదర్శికి జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ జారీ చేసిన షోకాజ్ నోటీసు

గొలుగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యదర్శి ఒకరు నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 15 సంవత్సరాలపాటు రెండు జీతాలు తీసుకున్నారు. ఈ మేరకు సుమారు రూ.16 లక్షలు డ్రా చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు.. సదరు కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

గొలుగొండ మండలంలోని చోద్యం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యకలాపాలను కూడా మండల కేంద్రం గొలుగొండలో నిర్వహిస్తున్నారు. చీడిగుమ్మలలో మరొక సొసైటీ ఉంది. ఇక్కడ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ రాజు 2009 నుంచి చోద్యం సొసైటీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఒకచోట మాత్రమే జీతం తీసుకోవాల్సి వుండగా జీవో నంబర్ 151ని అతిక్రమించి 2009 నుంచి 2024 ఆగస్టు వరకు రెండు సొసైటీల్లోనూ జీతాలు డ్రా చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు ఆయనను బాధ్యతల నుంచి తప్పించి చోద్యం, చీడిగుమ్మల సొసైటీలకు జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావును ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించారు. ఆయన రికార్డులు పరిశీలించి పూర్వ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ రాజు ... మిగతా 8వ పేజీలో

26 నుంచి మళ్లింపు మార్గంలో పలు రైళ్లు...

- వివిధ స్టేషన్లలో హాల్ట్‌లు తాత్కాలికంగా తొలగింపు - 8లో

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన

- మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఘనంగా నిర్వహణ
- వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తజనం



కనకమహాలక్ష్మి ఆలయంలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఎలమంచిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ధర్మవరంలో గల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చనను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమార్చనకు హాజరయ్యారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ, ప్రతినిధులు కొఠారు కొండబాబు, మడుగుల సత్యనారాయణ, కొఠారు నరేష్, రాము తదితరులు విస్తృత ఏర్పాట్లు చేట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో కోలాహల వాతావరణం నెలకొంది.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రాంబిల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. రాంబిల్లిలో శుక్రవారం ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. భూ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే 45 రోజుల్లో పరిష్కారం చూపనున్నామన్నారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు వి.దినబాబు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, వైసీపీ నాయకులు వి.శ్రీనుబాబు, పి.కిషోర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పిల్లి అప్పారావు

మునగపాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పిల్లి అప్పారావును అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఇక్కడ ఆయనను పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మల ఆశీస్సులతోనే తనకు ఈ పదవి లభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, నాయకులు బొడ్డేడ మహేష్‌లతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మవరంలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



మునగపాకలో దగ్గరుండి వరి పనలను కట్టలుగా కట్టిస్తున్న వ్యవసాయ అధికారులు



రాంబిల్లిలో తడిసిన వరిపంటను కాపాడుకునే పనిలో నిమగ్నమైన అన్నదాతలు

ముసురుతో అన్నదాతల్లో కలవరం

- వరి పనలు తడవడంతో ఆందోళన



ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో తడిసి ముద్దయిన వరి పనలు

ఎలమంచిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడి అల్పపీడనం కారణంగా నాలుగు రోజుల నుంచి ఈ ప్రాంతంలో ముసురు వాతావరణం నెలకొంది. దీంతో వివిధ పనులపై ఇళ్ల నుంచి బయటకు వచ్చిన జనం తడిసి ముద్దవుతున్నారు. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మోస్తరు వర్షాలకుతోడు చల్లని గాలులు వీస్తుండడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలావుంటే, వరి పొలాల్లో కోసి ఉన్న పనలు తడిసిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొందరు కోసిన వరిని కుప్పలు పెట్టగా, చాలా మంది పొలాల్లో ఉంచడంతో వాటిలో నీరు చేరడంతో ముున్ముందు పరిస్థితి ఏమిటని మదన పడుతున్నారు. మరికొందరు తడిసిన పనలను వేరొక చోటు ఆరబెట్టేపనిలో ఉన్నారు. ఇదిలావుంటే, వర్షాలకు తడిసిన వరి పనలు మొలక రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్, ఏవో మోహన్‌రావు రైతులకు సూచించారు. మండలంలోని ధర్మవరం పరిసర ప్రాంతాల్లో వరి పొలాలను శుక్రవారం పరిశీలించారు. పలుచోట్ల వరి పనలు తడిసి ఉండడాన్ని చూసిని రైతులకు సూచనలు చేశారు. వరి పంట కోత కోసి ఉన్న చోట పనల మీద ఐదు శాతం ఉప్పు ద్రావణం నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొలకలు రాకపోవడమే కాకుండా గింజ రంగు మారకుండా ఉంటుందని వివరించారు. వరి పంటను కుప్పలు వేసిన రైతులు టార్పాలిన్‌లు కప్పి గట్టిగా కట్టుకోవాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దేముడు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలో ముసురు వాతావరణం కొనసాగుతోంది. గురువారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా శుక్రవారం జరిగిన వారపు సంత బోసిపోయింది. ప్రతి వారం అచ్యుతాపురంతో పాటు గాజువాక రోడ్డులోని మోసయ్యపేటలో సంతలు జరుగుతుంటాయి. పెద్దగా కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపారాలు సాగలేదు.

రాంబిల్లి : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో తడిన వరి పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రాంబిల్లి మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత రైతులకు సూచించారు. శుక్రవారం పలు గ్రామాల్లో పర్యటించి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 30 పంచాయతల్లో రైతులు 19.43 హెక్టార్లలో వరిపంట సాగు చేసినట్టు చెప్పారు. ఇప్పటి వరకు 79 హెక్టార్లలో రైతులు పంట కోతలు చేపట్టారన్నారు. తాజాగా వాతావరణానికి తడిసిన పనలతో పాటు పంటను ఏవిధంగా కాపాడుకోవాలో వివరించారు.

మునగపాక : అల్పపీడనం కారణంగా ముసురు వాతావరణం నెలకొనడంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 1390 హెక్టార్లలో వరి పంట వేశారు. ఇందులో చాలా వరకు పండడంతో కొందరు వరిని కోసి కుప్పలుగా పెట్టారు. చాలా మంది కోసిన వరి పనలు పంటపొలాల్లో ఉంచడంతో అవి తడిసి ముద్దయ్యాయి. దీంతో ఆయా రైతులు మదనపడుతున్నారు. మండల వ్యవసాయాధికారితో పాటు గ్రామ వ్యవసాయ అధికారులు జ్యోత్స్నకుమారి, సింధు, లక్ష్మి తదితరులు శుక్రవారం ఆంజనేయమూల, మూలబందగోడి,పేటకట్టు ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు.

'ఉపాధి హామీ' నిధులు పక్కదారి పడితే చర్యలు

- వైసీపీ పాలనలో అనేక అవకతవకలు
- గత ప్రజా వేదికలో వెలుగు చూసిన నిధుల దుర్వినియోగంలో రికవరీ ఎంతవరకు జరిగింది?
- ప్రజా వేదికలో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ



ప్రజావేదికలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం విజయవంతంగా కొనసాగేందుకు అంతా కృషి చేయాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రగడ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకంలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. పనులు జరగకుండా ఉపాధి నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవినీతికి తావు ఉండదన్నారు. ఉపాధి నిధులు సక్రమంగా వినియోగించాలని సూచించారు. నిధులు పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రజావేదికలో వెలుగుచూసిన ఉపాధి నిధుల దుర్వినియోగంలో ఏ మేరకు రికవరీ చేశారో చెప్పాలని ఆయన పట్టుబట్టారు. పని ప్రదేశాల్లో ఎటువంటి వసతులు కల్పించలేదని, పనులు చేయకుండానే డబ్బులు చెల్లింపులు జరుగుతున్నాయని సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, బ్రహ్మాజీలు ఆరోపించారు. వీటిపై విచారణ జరపాలని ప్రజావేదిక అధికారిణి రోజా రమణికి విన్నవించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్ఆర్‌పీ రాజేంద్ర, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న టూరిస్టు బస్సు

- ఒకరికి స్వల్ప గాయాలు
- కొక్కిరాపల్లి జంక్షన్ సమీపం జాతీయ రహదారిపై ఘటన



లారీని వెనుక నుంచి ఢీకొనడంతో నుజ్జయిన బస్సుముందు భాగం

ఎలమంచిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొక్కిరాపల్లి జంక్షన్ సమీపం జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం పెద్ద ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలు మినహా మిగిలినవారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు నుంచి విశాఖపట్నం ప్రయాణికులతో బస్సు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుడికి సమీపంలోని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం ఆ బస్సులో ప్రయాణికులంతా వెళ్లిపోయారు.

నేడు ఎలమంచిలి మండల సమావేశం

ఎలమంచిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఇక్కడ జరగనుంది. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానుందని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

మార్టూరు రోడ్డులో భారీ గుంత పూడ్చివేత



అచ్యుతాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈరోడ్డులో నూతుల్లాంటి గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు తరచూప్రమాదాలకు గురయ్యేవారు. ఇది గుర్తించిన అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమల కుమారి శుక్రవారం పలుచోట్ల గోతులను పూడ్చే పనులను చేపట్టారు. ప్రధానంగా ఇందిరమ్మ కాలనీ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చడంతో పలువురు ఆనందం వ్యక్తం చేశారు.



కోటవురట్ల స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్‌రావు

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

కోటవురట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల పోలీసు స్టేషన్‌ను నర్సీపట్నం డీఎస్పీ మోహన్‌రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. శాంతిభద్రతలపై సమీక్షించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాను నిరోధించాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులు పెడితే ఉపేక్షించేది లేదు: డీఎస్పీ

ఎస్.రాయవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు పెడితే ఉపేక్షించేది లేదని డీఎస్పీ మోహన్‌రావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. బెల్టు షాపుల నిర్వహణ, పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, హెల్మెంట్ ధరించపోయినా కేసులు నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం వరకు జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని, ఇందులో భాగంగా సంబంధిత అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి ప్రమాదాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై నివేదిక పంపామని ఆయన తెలిపారు.

విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలి



రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దాల సుందరి సూచించారు. శుక్రవారం శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో అంతర్జాతీయ గణిత విద్య, పరిశోధన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్ఆర్.సంతానం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివయ్యతో ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనచేసి రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో పరిశోధన చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెనుగొండ సుబ్బారావుతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

అత్యుత్సాహం ప్రదర్శిస్తే సహించేది లేదు

- సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం



సమావేశంలో అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్న వైస్ ఎంపీపీ గోవిందరావు

ఎస్.రాయవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తే సహించేది లేదని వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించడమే కాకుండా నూతనంగా నిర్మించే రోడ్డు విషయంలో హెచ్చరికలు జారీ చేశారు. హౌసింగ్ ఏఈ యుగేందర్ మాట్లాడుతుండగా పెదఉప్పలం సర్పంచ్ వెంకటరమణతో పాటు పలువురు సభ్యులు కలగజేసుకొని గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, పథకాల విషయాల్లో కనీసం సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దానికి వైస్ ఎంపీపీ గోవిందరావు కలగజేసుకొని అధికారులు ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ నిబంధనల ప్రకారం సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇవ్వకుండా అత్యుత్సాహంతో ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తే వదిలేది లేదని హెచ్చరించారు. ఈ విషయానికి సంబంధించి అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదంటూ ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు సియ్యాదుల వరహాలమ్మ ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణకు పిర్యాదు చేశారు. తరువాత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్ మాట్లాడుతుండగా జలజీవన్ మిషన్ పనుల పేరుతో రోడ్లను పాడుచేసి పట్టించుకోవడం లేదంటూ గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జలజీవన్ పనుల్లో నాణ్యత లేదంటూ మరికొందరి ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి మాట్లాడుతుండగా జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి కలగజేసుకొని పీహెచ్‌సీలో రోగులకు కాలం చెల్లిన మందులు ఇచ్చినట్టు తెలిసిందని, అటువంటి మందులు మింగిన వారికి ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ ఏఈ సత్యవేణి మాట్లాడుతూ వాకపాడు నుంచి బంగారమ్మపాలెం నూతన రోడ్డు కోసం ప్రస్తావించగా వాకపాడు సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ మాధవ కలగజేసుకొని వాకపాడు నుంచి తమ గ్రామానికి రోడ్డు నిర్మిస్తే ఎస్ఏవోటీకి తప్ప తమ ప్రజలకు ఉపయోగపడదని, దాన్ని నిలిపి వేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా రేవుపోలవరం నుంచి బంగారమ్మపాలెం గ్రామానికి రోడ్డు నిర్మించాలని, అలా కాకుండా వాకపాడు నుంచి రోడ్డు నిర్మిస్తే అడ్డుకుంటామని హచ్చరించారు. అలాగే ధర్మవరం అగ్రహారం నుంచి ఎస్.రాయవరం రోడ్డు కోసం ఏఈ ప్రస్తావించగా వైస్ ఎంపీపీ గోవిందరావు మాట్లాడుతూ ఈ రోడ్డును విస్తరణ చేస్తేనే నూతన రోడ్డును నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న విధంగా నిర్మించడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. అలాగే పలు సమస్యలపై సంబంధిత అధికారులను ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. టీడీపీ ఎంపీటీసీ సభ్యులకు గౌరవం లేదని ధర్మవరం అగ్రహారం ఎంపీటీసీ సభ్యురాలు సియ్యాదుల వరహామ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనుల కార్యక్రమాలకు అధికార పార్టీకి చెందిన తనకు కూడా అధికారులు ఎటువంటి సమాచారం అందించకుండా అవమానిస్తున్నారని వాపోయారు. ఇలాగైతే ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఏమీ న్యాయం చేయగలమని ఆమె ప్రశ్నించారు.

వాయుగుండంతో రైతుల ఆందోళన



రాజుపేట గ్రామంలోని పొలంలోనే తడిసిపోయిన వరి పనలు

కోటవురట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో రైతులకు కంటి మీద కునుకు లేకపోతోంది. నెల రోజుల వ్యవధిలో మూడుసార్లు తుఫాన్లు సంభవించడంతో వారు దిగాలు చెందుతున్నారు. వరి పంట పడిందన్న ఆశ మిగడం లేదని వాపోతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి వాయుగుండం ప్రభావం కారణంగా వర్షం ప్రారంభం కావడంతో వరి పొలాల్లోనే కోతలు కోసి ఉన్న పంటను చూసి భయాందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు వరిపొలాలు కోతలు కూడా కోయలేదు. పలుచోట్ల కోసి పనలను పంట చేలల్లోనే వదిలేశారు. శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న ముసురు వర్షం కారణంగా వరి పంట తడిసిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా పంట కోతలు సమయంలో వర్షాలు పడడాన్ని అన్నదాతలు జీర్ణించుకోలేక విలవిలాడిపోతున్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: వాయుగుండం ప్రభావంతో శుక్రవారం నుంచి మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. చల్లని గాలులు వీచడంతో చలి తీవ్రత పెరిగింది. అయితే వర్షం మాత్రం నామమాత్రంగానే కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. నక్కపల్లిలో 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

డీపీవో, సర్పంచ్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు



డీపీవో, సర్పంచ్‌ను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన హోం మంత్రి అనిత

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం న్యాయంపూడి జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డును గెలుచుకోవడం పట్ల సీఎం చంద్రబాబునాయుడు జిల్లా అధికారులను, సర్పంచ్‌ను అభినందించారు. గురువారం రాత్రి హోం మంత్రి అనిత సమక్షంలో సీఎం చంద్రబాబును డీపీవో శిరీషారాణి, సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు కలిశారు. రాష్ట్రంలో నాలుగు పంచాయతీలకు ఈ పురస్కారం దక్కినట్టు హోం మంత్రి అనిత సీఎంకు వివరించారు. ఈ మేరకు రాష్ట్రపతి అందజేసిన అవార్డు, ప్రశంసాపత్రాన్ని సీఎం మరలా వారికి అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు.

మార్గశిరం ఎంతో ఉత్కృష్టం

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీకం, అశ్వీయుజమాసాలకు ఎంతో విశిష్టత వుందో సనాతనమైన హిందూ ధర్మంలో కూడా మార్గశిరమాసానికి అంతటి విశిష్టత వుందని ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. శుక్రవారం ఆలయంలో తిరుప్పావై పాశుర విన్నపం చేస్తూ, మార్గశిరమాసం విశిష్టత గురించి ఆయన వివరించారు. గీతలో శ్రీకృష్ణుడు మాసానాం మార్గ శీర్షోహమని పేర్కొన్నారని చెప్పారు. రుతువుల్లో వసంతం, మాసాల్లో మార్గశిరం కూడా శ్రీకృష్ణ స్వరూపమేనని ఆయన తెలిపారు. కీర్తనలతో స్వామివారిని ప్రసన్నం చేసుకోవచ్చునడానికి ధనుర్మాసం ఒక నిదర్శనమని చెప్పారు. ఆధ్యాత్మిక భావాలు, ఆలయ దర్శనాలు, యజ్ఞ,యాగాదులు, దీపారాధన, అన్నదానాలు, జప,తపాల వల్ల మానవుల్లో తమో, గుణాలు తగ్గి, సత్వగుణ లక్షణాలు అలవడుతాయని ఆయన వివరించారు

సీఎం చంద్రబాబు దృష్టికి ఉపమాక గ్రామకంఠం సమస్య

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపమాక గ్రామ కంఠం సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తీసుకెళ్లారు. ఉపమాక 112 సర్వే నంబరులోని గ్రామ కంఠంలో వున్న భూములు, గృహాల రిజిస్ట్రేషన్లు పదేళ్ల నుంచి నిలిచిపోయాయి. గ్రామ కంఠం భూములన్నీ 22ఏ చేరిపోవడంతోనే ఈ సమస్య ఏర్పడింది. పలుమార్లు జేసీ, కలెక్టర్ స్థాయి అధికారుల దృష్టికి నాయకులు తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. ఎట్టకేలకు హోం మంత్రి అనిత సమక్షంలో గురువారం రాత్రి సీఎం చంద్రబాబును కొప్పిశెట్టి బుజ్జి కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని కొప్పిశెట్టి బుజ్జి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. సీఎంను కలిసిన వారిలో నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, గోసల శ్రీకాంత్, వి.శ్రీను ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

కోటవురట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా యండపల్లి గ్రామంలో దళితులు శుక్రవారం నిరసన తెలిపారు. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మార్టిఅప్పలరాజు, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేదా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు రావాడ రత్నం, వార్డు మాజీ సభ్యులు గడమాల పద్మ, దుండి అపారావు, కొల్లాబత్తుల ఈశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.నర్సాపురం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పూర్వ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేవవరపు రఘు, తేజోమూర్తుల కృష్ణశర్మ, మేడిశెట్టి పెంటయ్య, కొర్రా రాధారాణి సహాయ సహకారాలతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన మోడల్ టెస్టు పేపర్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి దేవవరపు శ్రీను, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గాలి వెంకట గోవిందరావు, విద్యా కమిటీ చైర్మన్ మాసా ఈశ్వరరావు పాల్గొన్నారు.

రెల్లి కులస్థులకు న్యాయం చేయరూ..

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడి వున్న రెల్లి కులస్థులను ప్రభుత్వం ఆదుకుని సరైన న్యాయం చేయాలని అనకాపల్లి జిల్లా రెల్లి కుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బంగారి రాజు కోరారు. శుక్రవారం నక్కపల్లి రెల్లి కాలనీ వద్ద స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, రెల్లి కులస్థుల జీవితాల్లో ఏమాత్రం మార్పు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా చిరు వ్యాపారాలు చేసుకునే వారందరికీ రుణాలు ఇవ్వాలని కోరారు. సామాజిక, రాజకీయ రంగాలతో పాటు ఆర్థికంగా రెల్లి కులస్థులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు. త్వరలోనే రాష్ట్ర రెల్లి సంఘం ప్రతినిధుల సమక్షంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలుస్తామని ఆయన చెప్పారు.


అనకాపల్లిలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నిలిచిన నీరు


ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట రోడ్డుపై....


పిసినికాడ గ్రామంలో పంట పొలంలో తడిసి ఉన్న వరిపనలు


అనకాపల్లిలో చిరుజల్లులు కురుస్తున్న దృశ్యం

ఆగని జల్లు.. జనం గోల్లు

» అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా ముసురు » బయటకు వచ్చేవారు తడిసిముద్ద » చిత్తడిగా రహదారులు

» అన్నదాతల దుస్థితి మరీ దారుణం » కోసిన వరి పనలు తడుస్తుండడంతో ఆందోళన » పొలాల్లో ఉన్న పంటను చూసి పలువురు దిగాలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావం కారణంగా మూడు రోజులుగా జిల్లాలో ముసురు కమ్మేసింది. గత రెండు రోజులు అడపాదడపా జల్లులు కురవగా, గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. తాజా వాతావరణం కారణంగా అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోయింది. దీంతో అనకాపల్లి- చోడవరం మధ్య రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని పల్లపు ప్రాంతంలో కూడా పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయానికి ఎదురుగా రోడ్డుకి సగానికి వర్షపు నీరు నిలిచిపోవడంతో వైద్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు మార్కెట్లలో అడుగు పెట్టలేని దుస్థితి నెలకొంది. ముసురుకు చలిగాలులు తోడు కావడంతో పిల్లలు, వృద్ధులు గజగజ వణుకుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారాలతో పాటు వివిధ పనులపై బయటకు వచ్చేవారు తడిసి ముద్దయ్యారు. రహదారులన్నీ చిత్తడిగా మారడంతో పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పలేదు.

కొత్తూరు : తాజా వాతావరణం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అందే సమయానికి అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తుండడంతో వరి పంట పరిస్థితి ఎలా ఉంటుందోనని మదన పడుతున్నారు. అనకాపల్లి మండలంలోని పిసినికాడ రెవెన్యూ పరిధిలో రైతులు వరి పంట కోత కోసి నేలపై వేశారు. ఇంతలో ముసురు పెట్టడంతో పనలు తడసి ముద్దయ్యాయి. దీంతో పంట ఎలా ఉంటుందోననే ఆలోచనలో పడ్డారు. ఒక వేళ పంట పాడైతే ఈ ఏడాది ఏం తినిబతకాలో అని ఆందోళన చెందుతున్నారు.

పరవాడ : బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. ఏకధాటిగా పడుతుండడంతో పాటు గాలులు వీయడంతో పలుచోట్ల వరి చేలు నేలకొరిగాయి. ఇప్పటికే కోత కోసిన వరి పనలు పొలాల్లోనే విడిచిపెట్టడంతో తడిసి ముద్దయ్యాయి. కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయానికి నీటి పాలవుతుందని అన్నదాత లబోదిబోమంటున్నారు.


పరవాడలో పొలంలోనే తడిసి ముద్దైన వరి పనలు

పరవాడ, తానాం, స్వయంభూవరం, కొత్త వెన్నెలపాలెం, గొల్లలపాలెంలలో వర్షం కారణంగా వరి చేలు నేలకొరగడంతో పాటు కోత కోసి పొలాల్లో విడిచిపెట్టిన పనలు నీటి పాలయ్యాయి. మరో రెండు రోజులు పాటు వర్షం కురిస్తే పొలాల్లోనే గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల వరి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే, తాజా వాతావరణం కారణంగా మూలస్వయంభూవరం, రేఖవానిపాలెం, పాత రాజన్నపాలెం, వెంకటాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


సబ్బవరం పొలంలో పనలు ఒడ్డుకు చేర్చుతున్న రైతులు

సబ్బవరం : ముసురు వాతావరణం అన్నదాతలను కలవరపెడుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. కోసిన పనలను కొందరు పొలాల్లో విడిచిపెట్టగా, మరికొందరు కుప్పలుగా పెట్టారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులకు అవి తడిసిముద్దయ్యాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గొర్లివానిపాలెం, ఇరువాడ, అసకపల్లి, గుల్లేపల్లి, వంగలి, మలునాయుడుపాలెం తదితర గ్రామాల్లో కొంత మంది రైతులు కుప్పలు పెట్టుకునే అవకాశం లేక మడుల్లోనే వదిలేయడంతో నీటి మునిగాయి. దీంతో ప్రస్తుతం ఆ పనలను ఒడ్డుకు చేర్చి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది సుమారు 1310 హెక్టార్లలో వరి పంట వేయగా, ఇప్పటి వరకూ 65 శాతం కోతలు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సబ్బవరంలో 22.4 ఎంఎం వర్షం నమోదైందని సహాయ గణాంకాధికారిణి రమాదేవి తెలిపారు.

28న కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



అనకాపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని చిన నాలుగురోడ్ల జంక్షన్ వద్ద గల కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఈ నెల 28వ తేదీకి వాయిదా పడింది. తొలుత ఈ నెల 21వ తేదీ శనివారం ఉత్సవాన్ని జరిపించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసింది. అయితే గత మూడు రోజులుగా అల్పపీడనం ప్రభావం కారణంగా ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురుస్తున్నందున ఉత్సవం వాయిదా వేసినట్టు కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి ఆది దంపతులకు విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆళ్ల వెంకట సత్యప్రసాద్, రామలక్ష్మి నర్సింగరావు,మోహన్ శివశంకర్, కుటుంబ సభ్యులు ఊంజల్‌సేవ జరిపారు.. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు చక్కని భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తుమ్మపాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు ప్రభుత్వ రంగ సంస్థలైన ఆసుపత్రులు, మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సఫాయి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు శుక్రవారం సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ్ మాట్లాడుతూ సఫాయి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నిరక్షరాస్యులైన సఫాయి కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కష్టపడి పనిచేస్తున్న ప్రతి నెల జీతాలు అందిన దాఖలాలు లేవని ఆరోపించారు. మరణించిన సఫాయి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోన దుర్గ, పి.గోవిందా, ఎస్.కిరణ్, ఎస్. సంతోష్, బి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం'

తుమ్మపాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టుతో రైతులను బెంబేలెత్తించిందని ఆరోపించారు. రైతులకు ఏ సమస్య వచ్చినా రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ రమేష్, మహిళా ఎస్ఐ మణికుమారి, వీఆర్వో అప్పలరాజు, నాయకులు రామకృష్ణ, సన్యాసిరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : భూములకు సంబంధించి దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్ అన్నారు. మండలంలోని కన్నూరులో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. సమస్యలను అర్జీల ద్వారా తెలియజేస్తే 45 రోజుల్లోగా పరిష్కారం జరుగుతుందని వివరించారు. అనంతరం 48 మంది అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, డిప్యూటీ తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వీఆర్వో పి.వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. జీవీఎంసీ 88వార్డు పరిధి గంగవరంలో


సదస్సులో మాట్లాడుతున్న మళ్ల సురేంద్ర

నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. భూములకు సంబంధించిన సమస్యలను సదస్సు దృష్టికి తీసుకు వస్తే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి అర్జీనీ ఆన్‌లైన్ చేస్తామన్నారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, లోకేశ్, వీఆర్వో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎంఏఎ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇదే స్కూల్‌లో 1974-75 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా సొంత నిధులను ఖర్చు చేసి 140 మంది విద్యార్థులకు వీటిని సమకూర్చారు. తాము పదో తరగతి చదువుకొని ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రిటైర్డు హెచ్ఎం బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. పూర్వవిద్యార్థులు ఆర్‌పీపీ ప్రసాద్, కొలపర్తి కన్నబాబు, ఆడారి రమణమ్మ, కొణతాల రత్నాజీ, వంకాయల రాజేశ్వరి, బుద్ద సత్యనారాయణ, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ప్రకాశరావు, సురేష్ పాల్గొన్నారు.


విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న వక్తలు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ


సదస్సులో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు సూచించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సంకల్ప కార్యక్రమంలో భాగంగా పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో వివరించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను ఎట్టిపరిస్థితుల్లో నడపరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

కశింకోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆనందపురం గ్రామంలో బెల్టుషాపులో విక్రయించేందుకు మద్యం కొనుగోలు చేసి తరలిస్తుండగా 30 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. ఈ మేరకు సదరు గ్రామానికి చెందిన బండారు అప్పలనాయుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నాటు సారా బట్టీ పై దాడి

అనకాపల్లి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లూరు గ్రామ శివారులో గౌరమ్మ గెడ్డ వద్ద నాటు సారా బట్టీపై అనకాపల్లి ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా15 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. అలాగే నాటుసారా తయారికి సిద్ధంగా ఉంచిన సామగ్రిని స్వాధీనం చేసుకుని బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనాయుడు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన రత్నాకర్



అనకాపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ శుక్రవారం ఉండవల్లిలో కలిశారు. ఈ సం దర్భంగా ప్రస్తుతం విద్యా వ్యవస్థలో సంస్కరణలు, నూతన విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, రాష్ట్రంలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల సమస్యలపై చర్చించినట్టు రత్నాకర్ కార్యాలయ వర్గాలు ఇక్కడి విలేకరులకు తెలిపాయి.

'దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

కొత్తూరు/పరవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ పట్ల అను చిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా అమి త్‌షా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అలాగే, పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానపరిచే విధంగా మాట్లాడడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పరవాడలో ఖండించారు. తక్షణమే ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వైసీపీకి విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ శంకరరావు రాజీనామా



సబ్బవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ శర గడం వరహా వెంకట శంకరరావు శుక్రవారం వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేసినట్టు తెలిపారు. సదరు పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పార్టీ అధి నేత జగన్‌మోహన్‌రెడ్డికి పంపినట్టు చెప్పారు.

నేడు వినియోగదారుల సదస్సు

పరవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పది గంటలకు వాడచీపురుపల్లి హైస్కూల్ ప్రాంగణంలో వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్టు సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల చట్టం లక్ష్యాలు, ప్రయోజనాలు తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్టు వివరించారు. మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు హాజరు కావాల్సిందిగా కోరారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి

పరవాడ/సబ్బవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని లంకెలపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, పరవాడ, వెన్నెలపాలెంలలో మేలు కొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు తెల్లవారుజామున సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భజనలు, భక్తిగీతాలను ఆలపించారు. ధనుర్మాసం పవిత్రతను ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణవేణి, అమ్మాజీ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, కె.కనకారావు, లక్ష్మి, సత్యవతి, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు. అలాగే, సబ్బవరం మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

జీవీఎంసీ బడ్జెట్ రూ.4,554.27 కోట్లు

» నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు ముసాయిదా

» ఆమోదం పొందితే కౌన్సిల్‌కు...

» అత్యధికంగా ఇంజనీరింగ్ విభాగానికి రూ.1,286.5 కోట్లు కేటాయింపు

» ప్రజారోగ్య విభాగానికి 459.49 కోట్లు

» ప్రాజెక్టులకు రూ.808.14 కోట్లు, రూ.4,709.15 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారుల అంచనా

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) రూ.4,554.27 కోట్లతో జీవీఎంసీ అధికారులు బడ్జెట్‌ను తయారు చేశారు. ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ముసాయిదాను ఆమోదించడంతో శనివారం స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పంపించబోతున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ముసాయిదాపై సభ్యులు చర్చించిన తర్వాత ఏమైనా సవరణలు చేయాలా?, ఆమోదించాలా? అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు. స్టాండింగ్ కమిటీ ఆమోదిస్తే తర్వాత కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ముసాయిదాను ప్రవేశపెడతారు.

2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో పోల్చితే రూ.ఆరు కోట్లు తగ్గించి రాబోయే ఆర్థిక సంవత్సరానికి ముసాయిదాను తయారుచేశారు. కొత్త బడ్జెట్‌లో అత్యధికంగా ఇంజనీరింగ్ విభాగానికి రూ.1,286.5 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి 459.49 కోట్లు, ప్రాజెక్టులకు రూ.808.14 కోట్లు, లైటింగ్‌కు రూ.116.15 కోట్లు, టౌన్‌ప్లానింగ్‌కు రూ.31.99 కోట్లు, యూసీడీ విభాగానికి రూ.27.54 కోట్లు, పార్కులకు రూ.71.42 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.338.93 కోట్లు, అమృత్ పథకానికి రూ.310 కోట్లు, ఇతర నిధులతో చేపట్టే ప్రాజెక్టులకు రూ.148 కోట్లు, ఆర్థిక సంఘం ద్వారా చేపట్టే పనులకు రూ.453.2 కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ముగింపు నిల్వ కింద రూ.154.88 కోట్లు చూపించారు.

జీవీఎంసీకి వచ్చే ఆదాయాన్ని పరిశీలిస్తే సాధారణ పద్దు కింద రూ.1,076.71 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.503.31 కోట్లు, ప్రాజెక్టుల ద్వారా రూ.560 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.312.26 కోట్లు, యూసీడీ ద్వారా రూ.15 కోట్లు, పార్కుల ద్వారా రూ.20 కోట్లు, ప్రజారోగ్యం ద్వారా రూ.22.59 కోట్లు, నీటి సరఫరా ద్వారా రూ.438.80 కోట్లు, అమృత్ ద్వారా రూ.300 కోట్లు, ఆర్థిక సంఘం ద్వారా రూ.450 కోట్లు, ఇతర ప్రాజెక్టుల కింద రూ.148 కోట్లు...మొత్తం ప్రారంభ నిల్వతో కలిపి రూ.4,709.15 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు.



బూదరాళ్ళ పంచాయతీ చీడిపల్లిలో కోసిన పంటను తరలిస్తున్న రైతులు



గధభపాలెం- చిట్టింపాడుల మధ్య వరి చేనులో నీరు నిలువకుండా తీసిన కాలువలు

అన్నదాతకు ఎంత కష్టం.. ఎంత నష్టం

- అల్పపీడన ప్రభావంతో ముసురు వాతావరణం
- తడిసిన వరి పనలు
- పంట కాపాడుకునేందుకు యాతన
- దెబ్బతింటున్న రాజ్‌మా, రాగులు, సామల పంటలు
- గిరిజన రైతులు ఆందోళన

అన్నదాతల ఆరుగాలం శ్రమ.. అల్పపీడనంతో ఆవిరవుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతన్న 'వెన్ను' విరుస్తున్నాయి. పొలాల్లో పంట దశలో చేలు.. కళ్లాలో కోసిన వరిపనలను రక్షించుకునేందుకు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. మినప, చిక్కుళ్లు, రాజ్‌మా, సామలు, రాగులు పంటలకూ వర్షం నష్టాన్నే మిగుల్చుతోంది. ఇదీ అకాల వర్షం కష్టం.. ఖరీఫ్ 'చి'వరి' వ్యథ. గిరిపుత్రుల క'న్నీ'టి' కథ'

సీలేరు, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చేతికి అందికి వచ్చిన పంటలు తడిసి నష్టపోతున్నట్టు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో మినప, రాజ్‌మా, చిక్కుళ్ళు, రాగులు, సామలు తదితర పంటలను అధికంగా సాగు చేశారు. ఈ ప్రాంతంలో సెప్టెంబరు 8వ తేదీన సంభవించిన తుఫాన్ ప్రభావంతో వరి, కూరగాయల పంటలు దెబ్బతిని రైతులు తీవ్రం నష్టపోయారు. ప్రస్తుతం వినుప, రాజ్‌మా, చెక్కుళ్లు, రాగులు, సామలు పంటలు బాగా పండాయి. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు ఈ పంటలు కూడా భారీగా నష్టవాటిల్లే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వలసగెడ్డ గ్రామంలో వినప పంట కోత పూర్తి కావడంతో కళ్లాల వద్దనే కుప్పలు వేశారు. అకాల వర్షంతో పంట తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పి రక్షణ చర్యలు తీసుకున్నా, అడుగున భూమి తడిసి పంట పాడైపోతోందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొయ్యూరులో..

కొయ్యూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం వేకువ జామునుంచి మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. రావణాపల్లి, నల్లగొండ బంగారమ్మపేట, బూదరాళ్ల, పెదమాకవరం, నడింపాలెం, బట్టపణుకుల, శరభన్నపాలెం, చిట్టింపాడు పంచాయతీల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో మండలంలో ఇప్పటికే 90 శాతం మేర తేలిక రకం నాట్లు వేసిన వరి చేను కోతలు పూర్తి చేసి కుప్పలు పెట్టారు. మిగిలిన పది శాతం కొంత మేర మడుల్లో కోసిన పనలు ఉండిపోవటంతో రైతులు వా టిని సంరక్షించుకునేందుకు పరుగుతీశారు. కుప్పలపై టార్పాలిన్‌లు కప్పే పనిలో పడ్డారు. మరికొంత మంది పక్వానికి వచ్చిన చేలలో వర్షాలకు నీరు నిల్వ ఉండకుండా కాలువలు తీశారు. కొన్ని చోట్ల కోత దశకు వచ్చిన పొలాల్లో సగం కోసి మిగిలిన సగం కోత కోయకుండా మడుల్లోనే ఉంచారు. ఈ ముసురు వాతావరణం అన్నదాతను హైరానా పెడుతోంది. ఎక్కడా భారీ వర్షం కురిసిన దాఖలాలు లేక పోవటంతో కొండవాగు ప్రవాహాలు సాధారణ నీటితో పారుతుండటంతో జనజీవనానికి అంతరాయం కలగలేదు.

సీలేరులో ముసురు

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో వాయుగుండం ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం నెలకొంది. తెల్లవారు ఆరు గంటల నుంచి సీలేరులో ఒక



సీలేరు: వలసగెడ్డ గ్రామంలో తడిసి ముద్దయిన మినప పంట

మోస్తరు వర్షం గంట పాటు కురవడంతోపాటు చలి గాలులు వీచాయి. అనంతరం కూడా అడపాదడపా చిరు జల్లులు కురుస్తూనే ఉండటంతో రోజువారీ కూలీలకు ఉపాధి లేక ఇళ్లకే పరిమితమయ్యారు. అలాగే, ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల్లో ముసురు వాతావరణంతో రైతులు ఇబ్బంది ఎదుర్కొన్నారు.

ముంచంగిపుట్టు : మండల పరిధిలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు పట్టింది. 23 పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో కోతలు కోసి నూర్పులకు సిద్ధంగా ఉంచిన వరి కుప్పలు వర్షానికి తడిచిపోయాయి. చేతికి అందివచ్చిన పంట తడిసిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అలాగే పలు గ్రామాలకు వెళ్లే మట్టి రహదారులు బురదమయంగా మారాయి. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాగులు వంకలు వర్షం నీరు వచ్చి చేరుతుంది.

రైతులు ఆవేదన..

హుకుంపేట: పలు గ్రామాల్లో రైతులు కోతలు చేసిన వరి పంట తడిసి చిత్తడిగా మరాయి. బుధవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. వాయుగుండం ప్రభావం హెచ్చరికలతో కొందరు వరి చేను కోతలు, మోతలు పూర్తి చేశారు. కొన్నిచోట్ల వదిలేసి వరి చేను తడిసిపోయింది. అలాగే, వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి. మండల కేంద్రం నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో ముసురు వాతావరణం నెలకొన్నది. తుపా



వలసగెడ్డలో వరి కుప్పలపై టార్పాలిన్ కప్పిన గిరిజన రైతులు

ను ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు తేలికపాటి వర్షం ఎడతెరిపివ్వకుండగా కురుస్తుంది. వర్షం వల్ల రైతుల వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలిగింది. కాఫీ పండ్ల సేకరణ, వరి నూర్పులను నిలిపివేశారు. కోతలు చేసుకున్న వరిని కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. వర్షం వల్ల నిర్మాణంలోనున్న చింతపల్లి-లంబసింగి ప్రధాన రహదారి చిత్తడిగా తయారైంది.

అరకులోయలో..

అరకులోయ: అరకులోయలో రెండవరోజు శుక్రవారం ముసురువాతావరణం కొనసాగింది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. పాఠశా లకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉపాధ్యాయులు, ఇతర సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు అంతా రాకపోకలకు అవస్థలు ఎదుర్కొన్నారు. ఫుట్‌పాత్‌పై వ్యాపారం కొనసాగించే చిరు వ్యాపారులు ముసురుతో వారి జీవనోపాధి దెబ్బతింది.



హుకుంపేటలో వర్షం నీటిలోనే వరి పనలు



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆధార్



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రింతాడ-2 సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక ఆధార్ కేంద్రాల వద్ద 0-5ఏళ్లలోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు చిన్నారులను ఆధార్ కేంద్రాల వద్దకు తీసుకొచ్చి ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఈకేంద్రాల్లో వివిధ ఆధార్ నవీకరణ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు



రమేశ్‌నాయుడుని సన్మానిస్తున్న నాయకులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేశ్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ కార్యాక్రమంలో అరకు నుంచి లంబసింగి వరకు పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధం చేసినట్టు చెప్పారు. జీకేవీధిలోని దోనుగుమ్మల జలపాతం అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే, పార్టీ సభ్యత్వాలను వేగవంతం చేయాలన్నారు. రూ. రూ. 100తో సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కోడా వెంకట సురేశ్ కుమార్, రామకృష్ణ, సిరిబాల శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణరావు, శంకరయ్య, సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కేసులు: ఎస్ఐ



కొమ్ములవాడలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీంద్ర

సీలేరు, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు తప్పవని స్థానిక ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీపరిధిలోని కొమ్ముల వాడ గ్రామంలో శుక్రవారం గిరిజనులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మారుమూల అటవీప్రాంతంలో రహస్యంగా గంజాయి సాగు చేసినా, వాటిని డ్రోన్‌ల సహాయంతో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రవాణాలో యువత పాల్గొనినా, ప్రోత్సహించినా కేసులు తప్పవని హెచ్చరించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

27న డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో ప్రవేశాలు



ప్రిన్సిపాల్ విజయ భారతి

చింతపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 27న ఇంటర్న్‌షిప్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాకర్ ఎం. విజయ భారతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తృతీయ సంవత్సరం విద్యార్థుల వృత్తినైపుణ్యం పెంపొందించేందుకు ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కి పంపిస్తామన్నారు. ఈ శిక్షణ ఇ చ్చేందుకు సిటీ ఇండస్ట్రీస్ కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు ప్రవేశాలు కల్పిస్తారని, విద్యార్థులు విధిగా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాయక్ , జగదీశ్‌బాబు, గ్రంథాలయ అధికారి జగత్‌రాయ్ పాల్గొన్నారు.

కలపను అక్రమంగా తరలిస్తే చర్యలు

హుకుంపేట డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండా వ్యాపారులు కలప తరలిస్తే కఠిన చర్యలు తప్పదని డీఆర్‌వో దేవి హెచ్చరించారు. ఎఫ్ఆర్‌వో లావణ్య ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. హుకుంపేటలో కలప లోడు చేస్తున్నా వ్యాన్‌ను తనిఖీ చేసి అనుమతి పత్రాలను పరిశీలించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడుతూ అనుమతులున్న కలప మాత్రమే రవాణా చేయాలని, అంతకు మించి ఉంటే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తమకు అనుమతులు ఇచ్చిన స్థలంలోనే లోడు చేయడంతో పాటు ముందుగా తమకు సమాచారమివ్వాలన్నారు.

భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రవి కుమార్

చింతపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక తహసీల్దార్ బి. రవి కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంతర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గిరిజనుల నుంచి పలు భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవె న్యూ సదస్సు వచ్చిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. మ్యూటేషన్, భూముల రిజిస్ట్రేషన్, సరిహద్దుపై అర్జీలు వస్తున్నాయన్నారు. ప్రధానంగా గిరిజనులు పట్టాదారుడు మరణిస్తే వారసులు మ్యూటేషన్ చేయించుకోవాలన్నారు. మ్యూటేషన్‌తో లబ్ధిదారులకు రైతు భరోసా, రాయితీ విత్తనాలు, ఎరువులు, రుణాలు అం దుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజ్‌కుమార్, సర్పంచ్ దురియ పుష్పలత, కూటమి నాయకుడు రీమల ఆనందరావు పాల్గొన్నారు.

సదస్సులు సద్వినియోగపర్చుకోండి

కొయ్యూరు: రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు కుమారస్వామి కోరారు. శుక్రవారం చీడిపాలెం పంచాయతీలో ఎంపీటీసీ సభ్యురాలు గంగా భవానీ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 49 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ కుమార్ స్వామి, రీ సర్వే డీటీ అప్పన్న, సర్వేయర్, వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'జీవో 3 సాధనకు ఐక్యతగా ముందుకు సాగాలి'

చింతపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించే జీవో 3 సాధనకు గిరిజనులు ఐక్యంగా ముందుకుసాగాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగులు శతశాతం ఆదివాసీలకు కేటాయించేందుకు జీవో 3 అవసరమన్నారు. ఈ జీవో రద్దు కావడంతో గిరిజన ప్రాంత యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యువత భవిష్యత్ కోసం పలు సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని ఆమె అభి ప్రాయం వ్యక్తంచేశారు. తాజాగా అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి పార్లమెంట్‌లో జీవో 3 ఆవశ్యకతను వివరించినట్టు చెప్పారు. గిరిజన ప్రాంత రాజకీయ నాయకులు ఈ జీవో సాధించుకునేందుకు ఐక్య కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పాఠశాలల పరిరక్షణ బాధ్యత



యూటీఎఫ్ మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం(యూటీఎఫ్)ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాడేరులోని సంఘ కార్యాలయంలో శుక్రవారం విద్యా వైజ్ఞానిక రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్‌ను జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూ ర్తయిన నేపథ్యంలో కాకినాడలో జనవరి 5, 6, 7, 8వ తేదీలలో మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలుంటేనే పేదలకు విద్యా రంగంలో న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీకటి నాగేశ్వరరావు, శెట్టి గంగాధర్, సీసా గోపి, గల్లెల సతీష్, కాకర రాజారావు, ఎం.శ్రీను పాల్గొన్నారు.

పెసా గ్రామ సభల షెడ్యూల్ మార్పు చేయాలి

పాడేరురూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా నిర్వహించనున్న పెసా గ్రామ సభల షెడ్యూల్ మార్చాలని కోరుతూ కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌కు వినతిపత్రమిచ్చినట్టు ఏపీ.ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర తెలిపారు. జిల్లా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఈ నెల 13వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండటం, క్రిస్మస్, సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో గిరి రైతులు బిజీగా ఉంటారు. అందువల్ల పెసా గ్రామ సభ ఎన్నికల షెడ్యూల్‌ను సంక్రాంతి తరువాత విడుదల చేయాలని కోరారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సర్టిఫికెట్ కోర్సు ఫర్ కాఫీ ఎస్టేట్ సూపర్‌వైజర్ (సీసీసీఈఎస్), డిప్లమో కోర్సు ఇన్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ (డీసీఈఎం) కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తిగల యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాడేరు కేంద్ర కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో ఎస్. రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కర్నాటక చిక్కమంగళూరు కేంద్ర కాఫీ పరిశోధన సంస్థ సర్టిఫికేట్, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసినట్టు చెప్పారు. ఏడాది కాలపరిమితిగల ఈ సర్టిఫికెట్ కోర్సులో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై 18-35ఏళ్ల లోపు యువతీ, యువకులు అర్హులన్నారు. రెండేళ్ల డిప్లమోకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు.ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బంధవీధిలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా బంద్

సీలేరు, డిసెంబరు 20, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని బంధవీధి గ్రామంలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొందని గ్రామస్థుడు కిల్లో సన్యాసిరావు తెలిపారు. గత కొద్దిరోజులుగా తమ గ్రామానికి విద్యుత్ సరఫరా తరచూ అంతరాయం నెలకొంటోందని, దీనిపై ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఇళ్లలోకి విష సర్పాలు ప్రవేశించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు



విద్యార్థులకు బహుమతులందించిన విద్యుత్ అధికారులు

పాడేరురూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ నుంచి పాడేరులోని వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించిన విద్యుత్ శాఖాధికారులు విజేతలను శుక్రవారం బహుమతులను అందించారు. చిత్రలేఖన పోటీల్లో కె.నయోమి, జి.యోషిత, జి.లహరి అనే విద్యార్థులు ప్రథమ బహుమతులను కైవసం చేసుకోగా, ఆర్.దేవజన్య, కె.చరణ్‌తేజ, కె.నాగచైతన్య, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వ్యాసరచనలో బి.గ్రీష్మ, జి.కుమారస్వామి ప్రథమ బహుమతులు, కె.అభిరామ్, ఆర్.లక్ష్మీసాయి ప్రణీత, బి.సాయితేజేష్ ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఏ న్.ఎం.అప్పారావు, డిప్యూటీ ఈఈ కె.ఆనంద్ మురళీ, ఏఈ ఎంపీ రమణ, జేఈ వి.శ్రీనివాస్, సీవో బి.సతీష్‌కుమార్, విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షంలో గురుకుల ఉద్యోగుల దీక్షలు



రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులను సీఆర్టీలుగా మార్చాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరాహార దీక్షలు శుక్రవారానికి 35వ రోజుకు చేరుకున్నాయి. త భారీ వర్షాన్ని లెక్క చేయకుండా సమస్యలు సాధనకు శిబిరంలోనే దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.కొండబాబు, ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తాము 35 రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు సైతం పట్టించుకోపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో శిబిరంలో కూర్చోనే అవకాశం లేక పోవడంతో ఉద్యోగులు సాయంత్రం వరకు నిలబడే దీక్షలను కొనసాగించామన్నారు.

విద్యార్థులకు అర్థవంతంగా బోధించాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వచ్చేలా తరగతుల్లో బోధన జరపాల ని డీఈవో పి.బ్రహ్మాజీరావు సూచించారు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ (ఎస్ఏఎల్‌టీ)లో భాగంగా స్థానిక ఏపీఆర్ పాఠశాలలో విద్యా, ఐసీడీఎస్ సంయుక్తంగా శుక్రవారం ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మండలం నుంచి న లుగురు ఉపాధ్యాయులు, మండల సీడీపీవోలు ఈ శిక్షణ పాల్గొంటారన్నారు. 120 రోజులు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మూడు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, 11 మండలాలకు చెందిన 33 మంది ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రా జెక్టు పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీవో కె.శారద ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం జనమన్ స్కీం నుంచి మంజూరైన మండలంలోని మాదల పంచాయతీ కమలతోట, లోతేరు పంచాయతీ తోటవలస, లండిగుడ, పద్మాపురం పంచాయతీ బొండగుడల్లోని అంగన్‌వాడీ కేం ద్రాల్లో హె ల్పర్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. పదో తరగతి పాసైన మహిళలు 21 ఏళ్లనుంచి 35 సంవత్సరాల లోపు ఎస్టీ తెగలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 31వతేదీ అరకులోయ కార్యాయలంలో దరఖాస్తులను నేరుగా, పోస్టల్‌ద్వారా పంపవచ్చునన్నారు.

రెండు ఆయా పోస్టుల భర్తీకి..

అనంతగిరి:మండలంలో నూతనంగా మంజూరైన రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నమని, సీడీపీవో సంతోషికుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టోకూరు పంచాయతీ బొరిబొరివలస, కొండిబ పంచాయతీ గొందివలసలో ఆయా పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఎస్టీ కులానికి చెందిన మహిళలు దరఖాస్తులను ఈనెల 20 తేది నుంచి 31 వరకు, అనంతగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

మండల సమావేశం వాయిదా

పాడేరురూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన మండల సమావేశాన్ని తుఫాన్ నేపథ్యంఓ వాయిదా వేసినట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. వాతావరణం అనుకూలించక, సమావేశానికి సరిపడే కోరం లేనందున సమావేశం వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. త్వరలో మరో తేదీ త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పశువులు వదిలితే చర్యలు

పెదబయలు: రహదారులపై యథేచ్ఛగా పశువులను విడిచిపెడుతున్న యజమానులపై చర్యలు తీసుకుంటామని సీతగుంట సర్పంచ్ పలాసి మాధవరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'పశువుల కుమ్ములాటలో బాలునికి గాయాలు' అనే కథనానికి ఆయన స్పందించారు.బహిరంగ ప్రదేశాలలో పశువుల సంచారంతో తరచూ ప్రమాదాలు జరుగుతన్నాయన్నారు.


చోడవరం: గౌరీపట్నం, వడ్డాది పరిసరాల్లో వర్షాలకు నేలవాలిన వరిపైరు


రావికమతం: పాతశావరి పొలాల్లో తడిచిన వరి పనలు ఒడ్డుకు చేర్చుతున్న రైతులు


నర్సీపట్నంలో జోరున కురుస్తున్న వాన

చివరిలో కలవరం..

వాయుగుండంతో అన్నదాతలకు కష్టాలు

- వర్షాలకు నేలరాలిన వరి పైరు.. తడిసిన పనలు
- నీటిలో నుంచి పనలు బయటకు తీయడానికి అగచాట్లు
- ఆదరాబాదరాగా పొలాల్లోనే కుప్పలు
- కొనసాగుతున్న ముసురుతో భయంభయం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంతో మారడంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే కురుస్తున్న వర్షాలతో అయోమయంలో పడ్డ వరి రైతులు, కోతల సమయంలో ముంచుకొచ్చిన ముప్పుతో తీవ్ర కలత చెందుతున్నారు. పొలాల్లో నేలకొరిగిన వరి పైరును కాపాడుకోవడానికి నానా యాతన పడుతున్నారు. కోసిన పంటన కుప్పలు వేసుకోవడానికి పరుగులు పెడుతున్నారు. పంట చివరి దశలో వచ్చిన ఈ కష్టంతో కన్నీరు మున్నీరవుతున్నారు.

చోడవరం/రావికమతం/రోలుగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గం పరిధిలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల వరిపైరు నేలవాలిపోయింది. కోసిన వరిపనలు కళ్లాల్లోనే వదిలేయడంతో నీట త


చోడవరంలో ముసురు వాతావరణంలోనే పొలాల్లో వేసిన వరి కుప్పలు

డిసి అన్నదాతలకు ఆవేదన మిగిల్చింది. కోతలకు కూలీలు అందుబాటులో లేకపోయినప్పటికీ చాలా వరకూ వరి పైరు హడావిడిగా కోసి కుప్పలు పెట్టారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వదిలేసిన వరి పనలు తడిసి ముద్దయ్యాయి. మరో మూడు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో వరి పంటపై అన్నదాతలు ఆశలు వదిలేసుకుంటున్నారు. అలాగే రావికమతం కవ్వగుంట, రావికమతం, గర్నికం, దొండపూడి, కొత్తకోట, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం తదితర గ్రామాల్లో వరికోతలు కోసి పొలాల్లోనే పనలను ఆరబెట్టారు. ఈ నేపథ్యంలో ఏకదాటిగా వర్షం కురుస్తుండడంతో ఏం చేయాలో తోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు అధికమైతే తీవ్ర


మాకవరపాలెంలో వరి పనలకు ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న రైతులు

నష్టం వాటిల్లుతుందని రైతులు దిగాలు పడుతున్నారు. రోలుగుంట మండలంలోని రోలుగుంట, బీబీపట్నం, కొమరవోలు తదితర గ్రామాల్లో కోసిన వరి పనలు నీట మునిగాయి. దీనివల్ల ధాన్యం రంగుమారడమే కాకుండా మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన వరి పనలను గట్లపైకి, మెరక ప్రదేశాలకు చేర్చి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/మాకవరపాలెం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం: నర్సీపట్నం నియోజవకర్గం పరిధిలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం పడుతోంది. రెండు రోజులుగా తుఫాను ప్రభావంతో ఆకాశం నల్లటి కారుమబ్బులు కమ్ముకొని ఉంది. నర్సీపట్నంలో అంతగా ప్రభావం లేనప్పటికీ మిగిలిన మండలాల్లో రైతులు


గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో పొలాల్లోనే తడిచిన వరి పనలు

భయాందోళన చెందుతున్నారు. మాకవరపాలెం మండలంలోని మాకవరపాలెం, తామరం, కొండలఅగ్రహారం, బయ్యవరం, గిడుతూరు, మల్లవరం, పైడిపాల తదితర గ్రామాల్లో గురువారం ఉదయం కురిసిన వర్షానికి వరిచేను పనులు తడిచి ముద్దయింది. మరింతగా వర్షాలు కురిస్తే వరిచేను మొక్కలు మొలస్తాయని రైతులు భయపడుతున్నారు. మాకవరపాలెంలో వర్షానికి తడిచిన వరి పనలకు ఉప్పుద్రావణం నీటిలో కలిపి పిచికారీ చేస్తున్నారు. కొంతైనా వరిచేను కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గొలుగొండ మండలంలోని పాతమల్లంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, అమ్మపేట, జోగంపేట, పప్పుశెట్టిపాలెం, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం గ్రామాల్లో దాదాపు 200 హెక్టార్లలో వరి పనలు కుప్పలుగా వేయకుండా పొలాల్లోనే ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరిపనలు తడిసిముద్దవుతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, విప్పలపాలెం తదితర గ్రామాల్లో కోసిన వరిపనులు తడిసి ముద్దవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే పంట దక్కదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాతవరం మండలంలోని ఎంబీపట్నం, గుమ్మిమడిగొండతో పాటు అన్ని గ్రామాల్లోనూ ప్రస్తుతం కోసి ఉంచిన వరి పనలు పొలాల్లోనే దర్శనమిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అవి తడిచిపోయి ముద్దయ్యాయి. వీటిని కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. శనివారం నుంచైనా వర్షాలు తగ్గకకపోతే వరిపంట పూర్తిగా పాడవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కాగా, వర్షాలకు వరిపంటను ఎలా రక్షించుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వడానికి వ్యవసాధికారుల జాడే కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలో శుక్రవారం ముసురు వాతావరణం నెలకొంది. మాడుగుల మండలంలో గురువారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతునే ఉంది. దీంతో అందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. రైతులు కోతలు కోసి పొలంలోనే వదిలేసిన వరినారు తడిసి ముద్దయింది. వ్యవసాయ శాఖ అధికారులు కార్యాలయాల్లో ఉంటూ జరిగిన నష్టాన్ని అంచనాలు వేకుండా పొలాల్లో సర్వేచేసి తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని వేడుకుంటున్నారు.

చీడికాడ మండలంలో పండిన వరిచేనును మంగళ, బుధవారాల్లో పొలాల నుంచి కొంతమంది రైతులు కళ్లాల వద్దకు తీసుకురాగా, మరికొంత మంది పొలాల్లోనే కుప్పలు ఏర్పాటు చేసుకున్నారు. వర్షానికి వరిచేను నానిపోకుండా పలువురు రైతులు కాలువలు చేసి నీటిని బయటకు పంపుతున్నారు. ఈ క్రమంలో పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు


మాడుగుల రహదారిలో చెరువులను తలపిస్తున్న గతుకులు

మాడుగుల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగుల వచ్చే ఆర్‌అండ్‌బీ రోడ్డు పలుచోట్ల గుంతలు పడి అధ్వానంగా మారింది. ప్రధానంగా ఘాట్‌రోడ్డు జంక్షన్ దాటిన వెంటనే రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి పడింది. వర్షం నీటితో పాటు ఇళ్లలోని వాడుకనీరు గుంతల్లో చేరి నిలిచిపోతున్నది. రాత్రి వేళలో ఈ గుంతల వద్ద ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో మాడుగులలో మోదకొండమ్మ జాతర సందర్భంగా భక్తులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో వారు ఏదో తూతూమంత్రంగా రాళ్లు, పిక్కలు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గోతులు మరీ పెద్దవిగా మారి వాహన చోదకులకు మరిన్ని చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

మహాలక్ష్మినాయుడు సేవలు ప్రశంసనీయం


జిల్లా అధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మహాక్ష్మినాయుడు

రావికమతం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా అధికారులు కొనియాడారు. ఈ మేరకు అనకాపల్లి జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడు, ఉప విద్యా శాఖాధికారి అప్పారావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ జగదీశ్, స్టేట్ అబ్జర్వర్ అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త శంకుతల ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లాలోని 24 మండలాల్లో దివ్యాంగుల అభ్యున్నతికి, వారికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సదుపాయల కల్పనకు మహాలక్ష్మినాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


రోలుగుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

రోలుగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీఏసీఎస్ వద్ద శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సాధారణ రకం కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2300, గ్రేడ్-ఎ రకానికి రూ.2320 చొప్పున ఈ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తుందని ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో సొమ్ము జమవుతుందని చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ఈ కేంద్రంలోనే విక్రయించాలని ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రకటనలు.. మహిళల అగచాట్లు

- వెలుగు మార్ట్ అధికారుల తీరుతో అయోమయం
- సరకుల కొనుగోలుపై వేర్వేరు ధరల నిర్దేశం
- మొదట రూ.250... ఇప్పుడు ఒక్కసారే రూ.3 వేలు సరకులు కొనుగోలు చేయాలట!
- మార్ట్ వద్ద డ్వాక్రా సంఘాల సభ్యుల పడిగాపులు


వెలుగు మార్ట్ వద్ద పడిగాపులు పడుతున్న డ్వాక్రా సంఘాల సభ్యులు

మాకవరపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళా మార్ట్‌లో సరకులు కొంటే ఒక బాధ, కొనకపోతే మరో సమస్య అన్నట్టుగా డ్వాక్రా సంఘాల సభ్యులు పరిస్థితి తయారైంది. సరకుల కొనుగోలుపై విభిన్న ప్రకటనలతో వారికి దయనీయమైన దుస్థితి ఎదురవుతోంది. దీంతో ప్రతి రోజూ మార్ట్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

మండల కేంద్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యుల ద్వారా డబ్బులు వసూళ్లు చేసి సుమారు రూ.40 లక్షలతో ఈ మార్ట్‌ను ప్రారంభించారు. మొదటిలో సభ్యురాలు నెలకు రూ.250 సరకులు కొనుగోలు చేస్తే సరిపోతుందని వెలుగు సిబ్బంది చెప్పారు. ఇప్పుడు అదే వెలుగు సిబ్బంది ఏడాదికి ఒక్కసారే రూ.3000 సరుకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడంతో మహిళలు అయోమయంలో పడిపోయారు. ఇందులో భాగంగానే అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మహిళా మార్ట్ వద్దకు భారీగా డ్వాకా సంఘాల సభ్యులు తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు వచ్చిన వారు సాయంత్ర నాలుగు గంటలైనా సరకులు ఇవ్వకపోవడంతో మార్ట్‌లో సిబ్బందితో గొడవకు దిగారు. సరకులు కోనపోతే రుణాలు ఇవ్వమని బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారని, సరికదా ఒక్కసారే రూ.3 వేల సరకులు కొనుగోలు చేయమనడమేమిటని సిబ్బందిపై ధ్వజమెత్తారు. దీనికితోడు ఉదయం నుంచి మార్ట్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వెలుగు సిబ్బందితో ఒత్తిడితో ప్రతి రోజూ సరకులు కొనేందుకు తరలి వస్తున్నామని, ఇక్కడ పరిస్థితి అందుకు అనుగుణంగా లేదని, దీంతో వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు కూడా దెబ్బతింటున్నాయని వారు వాపోయారు. ఇప్పటికైనా మార్ట్‌లో సరకుల కోనుగోళ్లు నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

దీనిపై వెలుగు ఏపీఎం మంగను వివరణ కోరగా, శుక్రవారం ఒకేసారి సంఘాల సభ్యులు ఎక్కువుగా రావడంతో రద్దీ ఏర్పడిందని చెప్పారు. ప్రతి రోజూ కొంత మందిని మాత్రమే వెళ్లి సరకులు కొనుగోలు చేయాలని చెబుతున్నామని పేర్కొన్నారు.

భూ వివాదంపై ఫిర్యాదు చేసినా స్పందన లేదు

- నరసయ్యపేట రెవెన్యూ సదస్సులో సర్వేయర్లపై జిల్లా సర్వే అధికారికి బాధితుడి ఫిర్యాదు


సదస్సులో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సర్వే శాఖ అధికారి గోపాల్‌రాజు

చోడవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో రెవెన్యూ సిబ్బంది తప్పిదం కారణంగా తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని జిల్లా సర్వే అధికారి గోపాల్‌రాజు దృష్టికి బాధితుడు తీసుకువచ్చారు. మండలంలోని నరసయ్యపేట పంచాయతీలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వేలో తమకు జరిగిన అన్యాయాలపై పలువురు ఏకరువు పెట్టారు. ఇందులో భాగంగా కలగర్ల వెంకన్న అనే బాధితుడు భూమి విషయంలో రెవెన్యూ సిబ్బంది, గత సర్వేయర్ చేసిన తప్పిదం వల్ల తనకు అన్యాయం జరిగిందని, దీనిపై స్పందనలో పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. తన ఫిర్యాదుపై ఎప్పుడు అడిగినా విచారణ చేస్తామని తప్పించుకుటున్నారు తప్పితే న్యాయం చేయడం లేదని అధికారికి తన గోడు వినిపించారు. దీనిపై స్పందించిన సర్వే అధికారి గోపాలరాజు ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేసి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సదస్సులో రీ సర్వే లోటుపాట్లపై ఎక్కువ మంది ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారంతో బెంబేలు

- పెంపుడు కోళ్లు, దూడలపై గ్రామ సింహాల దాడులు


కొమిర గ్రామంలో ఓ ఇంటి ఎదుట స్వైరవిహారం చేస్తున్న కుక్కల గుంపు

రావికమతం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తుపోతున్నారు. ఎక్కడ చూసిన గుంపులుగా సంచరిస్తూ కోళ్లు, గొర్రెలు, మేకలతో పాటు పశుల పాకల వద్ద ఉన్న లేగ పెయ్యలపై దాడి చేసి చంపుతున్నాయి. ఒంటరిగా కనిపించే వారిపైనా దాడులు చేసి గాయాలపాలు చేస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావడంతో కళ్లాల వద్ద ఎవరు లేకపోవడంతో కుక్కలు లేగపెయ్యలను చంపుతున్నాయి. ఇటీవలే జి.గదబపాలెంలో మేకలదొడ్డిలో వీధి కుక్కలు చొరబడి నాలుగు మేకలను చంపాయి. మేడివాడ, రావికమతం, దొండపూడి, అర్జాపురం, కొమిర తదితర గ్రామాల్లో ఇప్పటికే ఎంతో మంది కుక్కల దాడిలో గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈ సమస్య ప్రతీ గ్రామంలో ఉన్నా, వీటి నియంత్రణకు ఎవరికి పట్టడం లేదనే విమర్శలున్నాయి. గతంలో గ్రామాల్లో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం జీవహింసపై కోర్టు ఆదేశాలు ఉన్నందున కుక్కల జోలికి వెళ్లలేక పంచాయతీ అధికారులు చేతులు ఎత్తేశారు. దీంతో గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య వందల్లో పెరిగిపోతోంది. ఫలితంగా వీటి బెడద తప్పడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్ ఇంధన పొదుపు వారోత్సవాలకు విశేష స్పందన

- ఈపీడీసీఎల్ డీఈ గౌరీప్రసాద్

చోడవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఇంధన పొదుపు వారోత్సవాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఈపీడీసీఎల్ డీఈ యు.కుమార్ గౌరీప్రసాద్ తెలిపారు. మండలంలోని పలు విద్యా సంస్థల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమాలకు వినియోగదారులు చక్కగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏఈ ఉదయ్‌కిరణ్, సిబ్బంది యుగంధర్, ఎల్ఐ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా ప్రయోజనాలు తెలుసుకోండి

చోడవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగా వల్ల లభించే ప్రయోజనాలను అందరూ తెలుసుకోవాలని ఏపీ యోగా అసోసియేషన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు పుల్లేటి సతీశ్ సూచించారు. యోగాతో చిన్న వయస్సు నుంచి పెద్దలు వరకూ కలిగే ఉపయోగాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యోగాను అనుసరించి ధ్యానం చేయాలని ఆయన సూచించారు. పట్టణంలో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విధుల్లోకి తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ల నిరసన

నాతవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విధుల్లోకి తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన తమను విధులు నుంచి తొలగించి జీవనోపాధి లేకుండా చేయడం అన్యాయమని సంఘం ప్రతినిధి పోలుపర్తి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు లేకుంటే కుటుంబాలతో రోడ్డున పడిపోతామని వాపోయారు. అనంతరం డాక్టర్ అనూషకు వినతిపత్రం అందించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు పూర్తి

చోడవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేసినట్టు పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముదుసు గోవింద్ తెలిపారు. ఇక్కడ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసిన కార్యకర్త బొబ్బిలి ప్రసాద్‌ను ఆయన అభినందించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని, వారి నుంచి రూ.3,280 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. గ్రామాల్లో కోడి పందాలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రతీ శనివారం దీర్ఘకాలిక సమస్యల పరిష్కార వేదిక: తహసీల్దార్


విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రావికమతం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ శనివారం దీర్ఘకాలిక సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని తహసీల్దార్ బి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలను జిల్లా కలక్టర్ ఎంపిక చేస్తారన్నారు. జిల్లా ప్రజా పరిష్కార వేదికలో నమోదైన సమస్యలలో ప్రతీ వారం ఐదు సమస్యల చొప్పున ఎంపిక చేసి ఇక్కడికి పంపుతారని ఆయన తెలిపారు. వీటికి సబంధించిన ఫిర్యాదుదారులకు ముందుగా నోటీసులు జారీ చేసి తహసీల్దార్ కార్యాలయంలో సమ్యన పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. తనతో పాటు మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, ఎస్ఐతో కూడిన కమిటీ పరిష్కార చర్యలు తీసుకుంటుందని వివరించారు. శనివారం పరిష్కరించాల్సిన సమస్యలు ఇప్పటికే తమ కార్యాలయానికి చేరాయని ఆయన తెలిపారు.

వరి పంట రక్షణ చర్యలు చేపట్టాలి

మాడుగుల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు భారీగా కురుస్తున్నందున తడిచిన, కోసిన వరి పంటల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, వాటి రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు సూచించారు. మండలంలోని సత్యవరం, వీరనారాయణం గ్రామాల్లో శుక్రవారం వరి పంటను పరిశీలించారు. వరి పనలు తడిచిపోవడాన్ని గుర్తించి, వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పనలపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు.

వైసీపీకి విశాఖ డెయిరీ డైరెక్టర్ రాజకుమారి రాజీనామా

గొలుగొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి రాజీనామా చేసినట్టు విశాఖ డెయిరీ డైరెక్టర్ టికెల రాజకుమారి తెలిపారు. మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో శుక్రవారం విలేకరులతో ఈ విషయం చెప్పారు. రాజీనామా పత్రాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడికి అందించానన్నారు. డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాలతో ఏ పార్టీలో చేరాలన్నది త్వరలో ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

నేడు కోనాం జలాశయం కమిటీ ఎన్నికలు

చీడికాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం జలాశయం ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించనున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నికల నిర్వహణకు నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల్లోపు అధ్యక్ష పదవికి, మధ్యాహ్నం 2 గంటల్లోపు ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక జరుగుతుందని వారు చెప్పారు.

250 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయం నుంచి శుక్రవారం రాత్రి 250 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 173 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.3 మీటర్లకు చేరింది. వర్షాలు కురుస్తున్నందున నీటిమట్టం కూడా గరిష్ఠస్థాయికి చేరడంతో అప్రమత్తమై మూడో నంబరు గేటు తెరిచి 250 క్యూసెక్కుల నీటిని పెద్దేరు ఏటి ప్రవాహంలోకి విడిచిపెట్టినట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



ఇందేశమ్మ ఘాట్‌లో రహదారిపై భారీ గొయ్యి

వర్షాలతో రోడ్లు మరింత ఛిద్రం

కోటవురట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండలంలో మరమ్మతులకు నోచుకోని పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అత్యంత దారుణంగా వున్న ఇందేశమ్మ ఘాట్‌రోడ్డులో భారీ గోతుల్లో నీరు చేరడంతో కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడు తున్నారు. కైలాసపట్నం నుంచి మాకవరపాలెం వెళ్లే రోడ్డు, కైలాసపట్నం నుంచి రాజుపేట వెళ్లే రోడ్డులో గోతులు మరింత అధికం అయ్యాయి. రామచంద్రపురం వద్ద రహదారి పూర్తి ఛిద్రమైంది.



కైలాసపట్నం- మాకవరపాలెం మార్గంలో రాజుపేట వద్ద గోతులు

క్రైం... crime news

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి



సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్/మునగపాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి - అచ్యుతాపురం మార్గంలోని నాగులాపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్‌ఐ షేక్ రషీద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన మళ్ల దేవకి కనక సత్యనారాయణ (45) ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈయన భార్య లక్ష్మి ఇంటి వద్ద కూరగాయల వ్యాపారం చేస్తుంటుంది. సత్యనారాయణ శుక్రవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వచ్చి కూరగాయలను కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. చీకటిగా వుండడంతో నాగులాపల్లి సమీపంలో గ్యాస్ గొడౌన్ ఎదుట ఆగి ఉన్న క్వారీ లారీని గమనించక వెనుక నుంచి ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఎస్.రాయవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామంలో మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ తెలిపారు. అడ్డరోడ్డులోని నక్కపల్లి పోలీసు సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ, సదరు గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతి(21) తన అమ్మమ్మ ఇంటికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన కె.నాగరాజు (43) అనే వ్యక్తి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అయితే తన కుమార్తె అమ్మమ్మ ఇంటికి చేరలేదని తెసుకున్న యువతి తల్లి వెతుక్కుంటూ వెళ్లింది. యువతిని నాగరాజు అనే వ్యక్తి అంగనవాడీ కేంద్రం పక్కనున్న రోడ్డులోకి తీసుకెళ్లాడని స్థానికులు చెప్పడంతో, ఆమె అటుగా వెళ్లింది. అక్కడ ఒక ఇంటిలో నుంచి కేకలు వినబడడంతో లోపలికి వెళ్లి చూసింది. దీంతో నాగరాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం మధ్యాహ్నం సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణరావు అరెస్టు చేశారు. అత్యాచారానికి గురైన యువతికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిమీద గ్రామ శివారులో వున్న ఒక తోటలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అరెస్టు చేసి రూ.1,02,760 నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సన్నిబాబు చెప్పారు.

అల్లకల్లోలంగా సముద్రం

» ఎక్కువ ఎత్తులో ఎగసి పడుతున్న అలలు



ముత్యాలమ్మపాలెం వద్ద అల్లకల్లోలంగా ఉన్న సముద్రం, తీరంలో నిలిపి వుంచిన మత్స్యకారుల పడవలు

పరవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సాధారణంకన్నా ఎక్కువ ఎత్తులో అలలు ఎగసి పడుతున్నాయి. తీరం వెంబడి ఈదురు గాలులు వీస్తున్నాయి. జిల్లా అధికారుల హెచ్చరికలతో మత్స్యకారులు రెండు రోజుల నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లడంలేదు. పడవలు, తెప్పలు, వలలను తీరంలో భద్రపరుచుకున్నారు.

ఎన్జీవో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఎన్జీవో అసోసియేషన్ క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం ఆవిష్కరించారు. శివపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు, కార్యదర్శి రమణబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణ, రామచంద్ర పాల్గొన్నారు.

ఆంధ్రా ఖోఖో జట్టు కెప్టెన్‌గా తెనుగుపూడి విద్యార్థి



ఆంధ్రా జట్టుకు కెప్టెన్ ఎంపికైన గాలి అజయ్

దేవరాపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న గాలి అజయ్ అండర్-17 ఆంధ్రా ఖోఖో జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఈ గురుకుల కళాశాల చరిత్రలోనే ఇది నిలిచిపోయే మధుర ఘట్టం. ఈయన 12 మంది సభ్యుల జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. ఈనెల 21 నుంచి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో జట్టులో ఈ జట్టు పాల్గొనుంది. దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు 28 రాష్ట్రాలకు చెందిన 38 జట్లు ఇందులో పాల్గొననున్నాయి. శనివారం నుంచి జరగనున్న పోటీలకు రెండు రోజులు ముందే ఈ జట్టు అయోధ్యకు చేరుకుంది. జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తెలుగోడి సత్తా చాటి చూపిస్తారని ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయ అధికారిణి ఎస్.రూపవతి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు

» ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

» జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవా





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీపీ వవా, హాజరైన వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో పనిచేసే సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు కూడా కనీస వేతనాలు అమలు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవా అన్నారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సఫాయి కర్మచారిలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల అధికారులు ప్రత్యేక మేళాలను ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేయాలని, ఇందుకోసం ఎటువంటి ష్యూరిటీలు అవసరం లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పశువులు, కోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు చేయవచ్చునన్నారు.

సఫాయి కర్మచారి కార్మికులు విధివశాత్తూ మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని ఆయన చెప్పారు. విధి నిర్వహణకు సంబంధించి కార్మికులకు దుస్తులు, బూట్లు, గ్లౌజు, నూనె ఇతర వస్తులను విధిగా అందజేయాలన్నారు. హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేయించాలని, నిర్ణీత సమయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు.

అందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందించాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ వై.సత్యనారాయణరావు, అదనపు ఎస్పీ దేవప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.రాజేశ్వరి, డీపీవో ఆర్.శిరీషారాణి, డీఈఓ జి.అప్పారావునాయుడు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.వసంతరావు, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్లు ప్రసాదరాజు, సురేంద్ర, జీవీఎంసీ జోనల్ అధికారులు పాల్గొన్నారు.

27 నుంచి విశాఖలో నృత్య శిఖరాగ్ర సమావేశం

» పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేశ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నిర్వాహకులు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నృత్య శిఖరాగ్ర సమావేశం ఐటీడీసీ-2024 పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం విశాఖపట్నంలో ఆవిష్కరించారు. ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజులు విశాఖలో ఈ సమావేశాలు జరుగుతాయని ఐటీడీసీ వ్యవస్థాపకులు, సమావేశ నిర్వాహకులు బత్తిన విక్రమగౌడ్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులు సమావేశాలు నిర్వహించి, గ్రాండ్ ఫినాలే ఏఎంజీ పార్కులో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు, కళాకారులను ఘనంగా సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రైటర్స్ అకాడమి ఛైర్మన్ వీవీ రమణమూర్తి, పర్యాటక శాఖ జిల్లా అధికారిణి జ్ఞానవేణి పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి

» కలెక్టర్ విజయకృష్ణన్



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, లేకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పంచాయతీరాజ్, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, నీటి పారుదల, గృహ నిర్మాణ, వైద్య ఆరోగ్య పశు సంవర్థక, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇదే సమయంలో అన్ని మండలాల ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మండలాల్లో జరిగే అన్ని అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని, త్వరగా పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. సీసీ, బీటీ రోడ్ల మరమ్మతులకు సంబంధించిన బిల్లులు వచ్చే బుధవారం సాయంత్రానికి సమర్పించాలని ఆమె తెలిపారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు వున్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలన్నారు. జిల్లాలో డయేరియా ప్రబలకుండా క్లోరినేషన్, శానిటేషన్, వాటర్ ట్యాంక్ క్లీనింగ్, డ్రైనేజీ క్లీనింగ్ పనులు చేపట్టాలని, ప్రతి రోజు ఉదయం ఎనిమిది గంటల లోపు పారిశుధ్య పనులు పూర్తి చేసేలా బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో సీపీఓ జి.రామారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'పర్యాటక ఉత్సవాల తేదీలు త్వరలో ప్రకటన'

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక శాఖ నిర్వహించే ఉత్సవాల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఎక్కడెక్కడ ఏ తరహాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలనే అంశంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. రుషికొండపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యాటక శాఖ నిధులతో నిర్మించిన భవనాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలనే దానిపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

పరిటాల రవి హత్య కేసులో ముద్దాయి రేఖమయ్య బెయిల్‌పై విడుదల

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవి హత్య కేసులో జీవిత కాలం శిక్ష అనుభవిస్తున్న రేఖమయ్య శుక్రవారం బెయిల్‌పై విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదల అయ్యాడు. అతడిని 2014లో నెల్లూరు జైలు నుంచి ఇక్కడి కారాగారానికి తీసుకువచ్చారు. తాజాగా బెయిల్ లభించడంతో రేఖమయ్యను విడుదల చేశారు. పరిటాల రవి హత్య కేసు 2004లో జరిగింది. ఈ కేసులో ముద్దాయి అయిన రేఖమయ్య తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవాడు.

26 నుంచి మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట, విజయవాడ సెక్షన్‌లలో మూడో లైను నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 26 నుంచి పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడపనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 26 నుంచి జనవరి 8 వరకూ కాజీపేట స్టేషన్‌లో హాల్ట్ ఉండదు. విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 8, 9 తేదీల్లో ఖమ్మం, వరంగల్ స్టేషన్లలో హాల్ట్ ఉండదు. ముంబై-భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లకు జనవరి 6 నుంచి 8 వరకు కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం టౌన్, మధిర స్టేషన్లలో హాల్ట్ ఉండదు. షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045)కు జనవరి 6 నుంచి 8 వరకు, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046)కు జనవరి 7 నుంచి 9 వరకూ ఖమ్మం టౌన్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, జనగామ, ఆలేరు, భువనగిరి స్టేషన్లలో హాల్ట్ ఉండదు. షాలిమార్-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22849)కు జనవరి 1, 8 తేదీల్లో వరంగల్, కాజీపేట స్టేషన్లలో, సికింద్రాబాద్-షాలిమార్ సూపర్‌ఫాస్ట్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774)కు జనవరి 7న వరంగల్, రాయనపాడు స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

భరణికంలో మరొకరికి అతిసార

పరవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణికంలో మరొకరు డయేరియాబారిన పడ్డారు. ఐదు రోజుల వ్యవధిలో 17 మంది అతిసారకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన ప్రగడ జగదీశ్ శుక్రవారం ఉదయం నుంచి విరేచనాలు కావడంతో కుటుంబసభ్యులు పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. కాగా డయేరియా బారినపడి ఆస్పత్రుల్లో చేరిన వారిలో 13 మంది ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో ఇళ్లకు చేరుకున్నారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు.

ఒక ఉద్యోగం.. రెండు జీతాలు!

... 5వ పేజీ తరువాయి

సుమారు రూ.16 లక్షలను అక్రమంగా డ్రా చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు తేల్చారు. చోద్యం సొసైటీలో 2024 జూన్ 28వ తేదీ నుంచి వివిధ రకాల రుణాలను రెన్యూవల్ చేయలేదని, జీవో 151ని అతిక్రమించి అధికంగా విత్‌డ్రా చేసిన రూ. 16 లక్షలు తిరిగి సొసైటీ ఖాతాలో జమ చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ రాజును ఆదేశించినట్టు చెప్పారు. దీనికి ఆయన స్పందించకపోవడంతో డీసీసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సహకార చట్టం జీవో నంబర్ 151ని అతిక్రమించి రూ.16 లక్షలు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్, చోద్యం సొసైటీ ఇన్‌చార్జి డి.శ్రీనివాసరావు ఈ నెల 7వ తేదీన ఆర్‌ఎస్‌ఎస్. రాజును షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై పూర్వ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎస్. రాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా సొసైటీల వ్యాపార లావాదేవీలను బట్టి ఉన్నతాధికారుల ఆదేశాలతో వేతనాలు డ్రా చేసుకోవచ్చని తెలిపారు. సొసైటీలో అక్రమంగా ఎటువంటి రుణాలు రెన్యూవల్స్ చేయలేదని తెలిపారు.

వైసీపీకి వరుస షాక్‌లు

... 5వ పేజీ తరువాయి

పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం లేదు.

ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ వైసీపీకి రాజీనామా

ఎలమంచిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నానంటూ రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పంపినట్టు తెలిపారు. కాగా రమాకుమారి ఐదేళ్ల క్రితం వరకు తెలుగుదేశం పార్టీలో వుండేవారు. 2014లో టీడీపీ తరఫున మునిసిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి చవిచూసిన తరువాత ఆమె వైసీపీలో చేరారు. తాజాగా ఆ పార్టీని కూడా వీడారు.

వాయుగండం

... 5వ పేజీ తరువాయి

పరవాడలో 10.2, రావికమతంలో 3.3, అనకాపల్లిలో 11.6, చీడికాడలో 12.2, బుచ్చెయ్యపేటలో 5.6, కశింకోటలో 12.4, అచ్యుతాపురంలో 6, మునగపాకలో 5.4, రాంబిల్లిలో 10.5, చోడవరంలో 10.2, ఎలమంచిలిలో 6.6, రోలుగుంటలో 5.8, నర్సీపట్నంలో 5.5, ఎస్.రాయవరంలో 5.4, మాకవరపాలెంలో 4.6, కోటవురట్లలో 3.8, నక్కపల్లిలో 2, గొలుగొండలో 3.2, నాతవరంలో 1.4, పాయకరావుపేటలో 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అధికారులు అప్రమత్తం....

జిల్లాలో వర్షాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ విజయకృష్ణన్ వెబెక్స్ ద్వారా మండలాల్లో వర్షాలు, పంట నష్టం, ఇతరత్రా వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. సముద్ర తీర ప్రాంతంలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, మరో రెండు, మూడు రోజులు వేట నిషేధాన్ని అమలు చేయాలని మత్స్య శాఖాధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మండల పరిషత్, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. మరో రెండు రోజులపాటు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని, అన్ని మండల కేంద్రాల్లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వర్షాలపై సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్లు (08924- 226599, 222888)కు అందించాలని సూచించారు.

కలెక్టర్ సమీక్ష

జిల్లాలో వర్షాలు పెరగనున్న నేపథ్యంలో రైతులు వరి పంట నష్టపోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పలు శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పంచాయతీరాజ్, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, నీటి పారుదల, గృహ నిర్మాణ, వైద్య ఆరోగ్య, పశు సంవర్థక, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు మండల కేంద్రాల్లోనే వుండాలని సూచించారు.

దొప్పెర్లలో భూ దందా

... 5వ పేజీ తరువాయి

కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. అలాగే సర్వే నంబరు 63లో వున్న 17.55 ఎకరాల భూమి ప్రభుత్వ మెట్ట అనాదీనం కింద ఇప్పటికీ డైగ్లాట్‌లో నమోదై ఉంది. ఇందులో 12.19 ఎకరాలను 22ఏ నుంచి తప్పించి ఒక వైసీపీ నాయకుడు, అతని అనుచరుల పేరున రెవెన్యూ రికార్డుల్లో మార్పించుకున్నారు. మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 108లో 7.6 ఎకరాల ప్రభుత్వ మెట్ట అనాదీనం కింద రికార్డుల్లో నమోదై ఉంది. ఇందులో 5.28 ఎకరాలను 22ఏ నుంచి తప్పించి మరో వైసీపీ నాయకుడు తనతోపాటు తన అనుచరుల పేరున రాయించుకున్నారు.

విచారణ జరపాలని ఎంపీటీసీ సభ్యుడు ఫిర్యాదు

దొప్పెర్ల పంచాయతీ పరిధిలో వైసీపీ నేతలు పాల్పడిన భూ దందాపై సమగ్ర విచారణ జరపాలంటూ స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు ఇటీవల అనకాపల్లి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆయా సర్వే నంబర్లలోని భూముల వివరాలను పరిశీలించి, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను తిరిగి 22ఏలో చేర్చాలని అధికారులను కోరారు.

అక్రమ మైనింగ్!

... 5వ పేజీ తరువాయి

తనిఖీలు నిర్వహిస్తున్నారు. మామిడిపాలెంలో ఒక నేతకు చెందిన క్వారీలో హద్దులు దాటి మైనింగ్‌కు పాల్పడినందుకు భారీగా జరిమానా విధించినట్టు సమాచారం. అక్రమ మైనింగ్‌పై అందిన ఫిర్యాదులపై తనిఖీలు జరుపుతున్న గనుల శాఖ విజిలెన్స్ అధికారులు.. ఆ వివరాలను బయటకు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

జరిమానాలు చెల్లించకుండానే మైనింగ్

అనకాపల్లి మండలంలోని పలు నల్లరాయి క్వారీలపై వైసీపీ హయాంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో మామిడిపాలెం, బవులువాడ, జంగాలపాలెం, రొంగలివానిపాలెం, మార్టూరు, మాకవరంలోని క్వారీల్లో గనుల శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు జరిపారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.60 కోట్లకు పైగా జరిమానా విధించారు. క్వారీల్లో తవ్వకాలతోపాటు ఎటువంటి లావాదేవీలు జరగకుండా ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆయా క్వారీల నిర్వాహకులు ఇందులో పది శాతం జరిమానా కూడా చెల్లించలేదని సమాచారం. నిబంధనల ప్రకారం విజిలెన్స్ తనిఖీల సందర్భంగా జరిమానా విధించిన క్వారీలకు సంబంధించి వాటి నిర్వాహకులు ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు చలానా కట్టిన తరువాత మాత్రమే కార్యకలాపాలు కొనసాగించాలి. కానీ గనులు, రెవెన్యూ పోలీసు శాఖలతోపాటు వైసీపీకి చెందిన స్థానిక నాయకులు ఆయా నల్లరాయి క్వారీల యజమానులకు అండగా నిలుస్తుండడంతో ప్రభుత్వానికి జరిమానా చెల్లించకుండానే మైనింగ్ కార్యకలాపాలు కొనసాగించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604